# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 154 | పేజీలు : 08 | శుక్రవారం | 12-06-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## శాశ్వత భవనాలు

- రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు: మంత్రి పొంగులేటి
- తొలి దశలో 125 తహసీల్దార్, 11 ఆర్డీవో కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మిస్తున్నట్టు పొంగులేటి వెల్లడి
- దీని ద్వారా శిథిలావస్తలో ఉన్న భవనాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వెల్లడి
- భవనాల నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపును వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం

2



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని ఆర్డీవో, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలను నిర్మించనున్నట్లు తెలంగాణ రెవెన్యూ,

## మెట్రో ఫేజ్-2కు అనుమతి, వరంగల్ ఎయిర్‌పోర్టు
# పనుల ప్రస్తావన

ప్రధానితో భేటీలో సీఎం వినతులు

- ప్రధాని మోదీతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశం
- నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం తర్వాత ఇరువురి మధ్య ప్రత్యేక భేటీ
- రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ప్రధానితో చర్చించిన సీఎం

2



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

ప్రధాని మోదీతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో సమావేశం అయ్యారు. నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశం తర్వాత పీఎం, సీఎం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ప్రధానితో చర్చించారు. పెండింగ్‌లోని అంశాలను ఆమోదించాలని ప్రధానిని కోరారు. మెట్రో ఫేజ్-2 విస్తరణకు అనుమతి ఇవ్వాలని కోరారు. వరంగల్ ఎయిర్‌పోర్టు పనుల గురించి ప్రస్తావించారు. మోదీతో భేటీ అనంతరం కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్?తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. మెట్రోరైలు విస్తరణకు అనుమతులపై కేంద్రమంత్రితో చర్చించారు. మూసీ ప్రక్షాళన, పట్టణాభివృద్ధి సంబంధిత ప్రాజెక్టులపై ఖట్టర్‌తో రేవంత్ చర్చించారు. ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో ప్రధాని నరేంద్రమోదీ



2

## దూకుడు విధానాలే కారణం

- డొనాల్డ్ ట్రంప్,సెంట్రల్ కమాండ్‌పై అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర విమర్శలు
- హర్మూజ్ సమీపంలో వాణిజ్య నౌకపై జరిగిన దాడిలో ముగ్గురు భారతీయుల మృతి
- ఈ పరిస్థితికి ట్రంప్ అనుసరిస్తున్న దూకుడు విధానాలే కారణమన్న ఒవైసీ
- అంతర్జాతీయ నౌకాయాన మార్గాల్లో రక్షణ కల్పించడంలో అమెరికా విఫలమయిందని విమర్శ

## ఈ రాత్రే ఇరాన్‌పై
# తీవ్ర దాడులు

ట్రంప్ సంచలన ప్రకటన

- ఇరాన్ కీలక ఆయిల్ కేంద్రమైన ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటామని వెల్లడి
- ఇప్పటికే ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న సైనిక ఘర్షణలు
- దాడుల హెచ్చరికల మధ్యే కొనసాగుతున్న దౌత్యపరమైన చర్చలు

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

అమెరికా - ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి పతాకస్థాయికి చేరాయి. ఇరాన్‌పై ఈ రాత్రే భారీస్థాయిలో దాడులు

## నన్ను ఈడీ అరెస్ట్ చేయలేదు..

2



ఆ వార్తలు అబద్ధం: కారుమూరి నాగేశ్వరరావు

- లిక్కర్ స్కాం కేసులో కారుమూరి అరెస్ట్ అంటూ వార్తలు
- అరెస్ట్ వార్తల్లో నిజం లేదన్న కారుమూరి
- ఉదయం నుంచి ఇంట్లోనే ఉన్నానని వెల్లడి

## 5000 కోట్ల స్కామ్‌కు చెక్!

హైదరాబాద్ పోలీసుల భారీ ఆపరేషన్.. రూ.5000 కోట్ల స్కామ్‌కు చెక్!

- రూ. 5000 కోట్ల భారీ మోసానికి పోలీసులు అడ్డుకట్ట
- 'ఇగ్నైట్' పేరుతో కొత్త స్కామ్‌కు తెరలేపిన క్యూనెట్ నిర్వాహకులు
- ఆపరేషన్ ఇగ్నైట్ క్రాక్‌డౌన్‌తో ఆరుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- సంస్థ ఏర్పడిన 18 రోజుల్లోనే చర్యలు తీసుకున్న హైదరాబాద్ సీపీఎస్

2



## ప్రధాని మోదీతో
# డీకే శివకుమార్ భేటీ

సీఎంగా బాధ్యతల తర్వాత తొలిసారి..

- రాష్ట్రాభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందించాలని విజ్ఞప్తి
- బెంగళూరు మెట్రో, రింగ్ రోడ్ వంటి మౌలిక సదుపాయాలపై ప్రధానంగా చర్చ
- గత ప్రభుత్వ వైఖరికి భిన్నంగా నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొన్న శివకుమార్

2



## ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల



2

- ఫస్టియర్, సెకండియర్ జనరల్, ఒకేషనల్ ఫలితాలు అందుబాటులో
- అధికారిక వెబ్సైట్లలో మార్కుల మెమోలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
- హాల్ టికెట్ నంబర్ ద్వారా ఫలితాలు తెలుసుకునే అవకాశం

## నౌకలపై దాడులు ఆపండి

గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలపై భారత్ తీవ్ర ఆగ్రహం

- గల్ఫ్ జలాల్లో వాణిజ్య నౌకలపై దాడులను తీవ్రంగా ఖండించిన భారత్
- అమెరికా జరిపిన దాడిలో ముగ్గురు భారత నావికుల దుర్మరణం
- ఘటనపై అమెరికా దౌత్యాధికారికి సమన్లు జారీ చేసి నిరసన
- దాడులు ఆపి, దౌత్యమార్గాల్లో సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపు
- పలు నౌకల్లో చిక్కుకున్న వందలాది భారతీయుల భద్రతపై ఆందోళన

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

గల్ఫ్ ఆఫ్ ఒమన్, దాని పరిసర జలాల్లో వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడుల

## కవిత కొత్త పార్టీకి
# పేరు చిక్కులు..

'టీఆర్ఎస్'పై ముప్పేట దాడి

2

- కవిత కొత్త పార్టీ 'తెలంగాణ రక్షణ సేన'కు పేరు చిక్కులు
- 'టీఆర్ఎస్' పేరు తమదేనంటూ అభ్యంతరం వ్యక్తం చేసిన బీఆర్ఎస్
- మహారాష్ట్రకు చెందిన ఓ పార్టీ కూడా అదే పేరు కోసం దరఖాస్తు
- కవిత పార్టీ పేరుపై ఈసీకి వందలాది ప్రజా అభ్యంతరాలు
- వివరణ ఇచ్చేందుకు ఎన్నికల సంఘాన్ని కలవనున్న కవిత ప్రతినిధులు



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

కవిత ప్రతిపాదించిన కొత్త రాజకీయ పార్టీ 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్)కు ఆరంభంలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. పార్టీ పేరు చుట్టూ తీవ్ర వివాదం నెలకొనడంతో, ఈ అంశం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. 'టీఆర్ఎస్' అనే పేరును ఇతరులకు కేటాయించవద్దంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) పలు వైపుల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తాయి. ఈ వివాదంలో ప్రధానంగా భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'టీఆర్ఎస్' అనే పేరు

## ట్యాంకర్‌పై అమెరికా దాడి..

మృతుల్లో విశాఖ నావికుడు పట్నాల సురేష్



2

- ఒమన్ తీరంలో చమురు ట్యాంకర్‌పై అమెరికా సైన్యం దాడి
- దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మృతి, 21 మందికి గాయాలు
- మృతుల్లో విశాఖపట్నంకు చెందిన చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేష్
- త్వరలో 15వ వివాహ వార్షికోత్సవం జరుపుకోవాల్సి ఉండగా విషాదం

## గోదావరి పుష్కరాల కోసం
# ప్రత్యేక ప్రణాళికతో వెళ్తున్నాం

: మంత్రి పొన్నం ప్రభాకర్

2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

రాబోయే 2027 గోదావరి పుష్కరాల కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళు_న్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. నాలుగు జిల్లా కేంద్రాలకు ఫోర్‌లైన్స్ రోడ్డు ఉన్న హుస్నాబాద్‌ను మరింత అభివృద్ధి చేస్తున్నామని.. డ్రైనేజీ సిస్టమ్ అభివృద్ధి చేస్తామని

# శాశ్వత భవనాలు

మొదటి పేజీ రువాయి

హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈరోజు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు గౌరవప్రదమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.తొలి దశలో భాగంగా 125 తహసీల్దార్, 11 ఆర్డీవో కార్యాలయాలకు ఒకే నమూనాలో కొత్త భవనాలను నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అద్దె ఇళ్లలో, శిథిలావస్థలో ఉన్న కార్యాలయాల సమస్యకు దీని ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు తుది డిజైన్లను ఖరారు చేస్తామని తెలిపారు. భవన నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.మరోవైపు, ఓఆర్ఆర్ పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి ఆధునిక సమీకృత భవనాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్, పటాన్‌చెరు, కోహెడలలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. గత ప్రభుత్వం ప్రణాళిక లేకుండా మండలాల పునర్విభజన చేసిందని విమర్శించిన మంత్రి, తాము కొత్త మండలాలకు అవసరమైన పోస్టులను భర్తీ చేసి పరిపాలనను బలోపేతం చేశామని వివరించారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## ఈ రాత్రే ఇరాన్‌పై
# తీవ్ర దాడులు

మొదటి పేజీ రువాయి

చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. సమీప భవిష్యత్తులో ఇరాన్‌కు చెందిన కీలక చమురు క్షేత్రాలను, ముఖ్యంగా ఖర్గ్ ద్వీపాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.గురువారం తన ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఈ రాత్రే అమెరికా బలగాలు ఇరాన్‌పై అత్యంత తీవ్రమైన దాడులు చేయనున్నాయి. త్వరలోనే ఖర్గ్ ద్వీపంతో పాటు ఇతర చమురు మౌలిక సదుపాయాల కేంద్రాలను స్వాధీనం చేసుకుంటాం. వారి చమురు, గ్యాస్ మార్కెట్లపై పూర్తి నియంత్రణ సాధిస్తాం" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.ఇప్పటికే ఇరు దేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఇటీవల ఇరాన్‌కు చెందిన గగనతల రక్షణ, నిఘా వ్యవస్థలపై అమెరికా దాడులు నిర్వహించింది. మరోవైపు, తమ అపాచీ హెలికాప్టర్‌ను ఇరాన్ కూల్చివేసిందని అమెరికా ఆరోపిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ చేసిన తాజా హెచ్చరికలు అంతర్జాతీయంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.పర్షియన్ గల్ఫ్‌లో ఉన్న ఖర్గ్ ద్వీపం, ఇరాన్ చమురు ఎగుమతులకు ప్రధాన కేంద్రం. ఆ దేశం నుంచి జరిగే ముడి చమురు ఎగుమతుల్లో సుమారు 90 శాతం ఇక్కడి నుంచే సాగుతాయి. ఈ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ ప్రకటించడం ప్రపంచ దేశాల్లో ఆందోళన కలిగిస్తోంది. సైనిక చర్యల హెచ్చరికల కొనసాగుతున్నప్పటికీ, ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన చర్చలు కూడా జరుగుతున్నాయని, అయితే అవి మందకొడిగా సాగుతున్నాయని తెలుస్తోంది.

# నన్ను ఈడీ అరెస్ట్ చేయలేదు..

మొదటి పేజీ రువాయి

తమను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్ట్ చేశారంటూ వస్తున్న వార్తలను ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. "నన్ను ఈడీ అరెస్ట్ చేయలేదు.. ఉదయం నుంచి నేను ఇంట్లోనే ఉన్నాను. నా అరెస్ట్‌పై జరుగుతున్న ప్రచారమంతా పూర్తిగా అవాస్తవం" అని ఆయన స్పష్టం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు.ఏపీ లిక్కర్ స్కాం కేసులో భాగంగా గురువారం హైదరాబాద్‌లో నిందితుల ఇళ్లలో ఈడీ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలోనే మద్యం రవాణా కాంట్రాక్టు, టెండర్ల వ్యవహారంలో జరిగిన అక్రమాల కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కెసిరెడ్డిని అధికారులు అరెస్ట్ చేశారు.ఈ కేసులో నిందితుడిగా ఉన్న కారుమూరి నాగేశ్వరరావును కూడా ఈడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారంటూ సోషల్ మీడియా, కొన్ని మీడియా సంస్థల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో ఆయన స్పందిస్తూ, తన అరెస్ట్ వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశారు

## మెట్రో ఫేజ్-2కు అనుమతి, వరంగల్ ఎయిర్‌పోర్టు
# పనుల ప్రస్తావన

మొదటి పేజీ రువాయి

అధ్యక్షతన జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆ సమావేశంలో తెలంగాణ అభివృద్ధి నమూనాను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. దేశాభివృద్ధి అంటే.. ప్రజల అభివృద్ధేనని గుర్తుచేసిన సీఎం ప్రజలను ఆర్థిక శక్తులుగా, దేశనిర్మాతలుగా తీర్చిదిద్దడంలో విద్య, ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు.

విద్యే ప్రభావితం చేస్తోంది

తెలంగాణ ప్రభుత్వం 2024లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వేలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని రేవంత్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మూడున్నర కోట్ల మంది, 242 కులాలకు చెందిన ప్రజల వివరాలను సేకరించినట్లు చెప్పారు. ఆ సర్వేలో నగదు, భూమి కంటే విద్యే సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తోన్న ముఖ్యమైన అంశంగా తేలిందని చెప్పారు. ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య అందించడం ద్వారానే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని స్పష్టం చేశారు.ప్రస్తుతం నాణ్యమైన విద్య అందించడం సవాలుగా మారిందని సీఎం వ్యాఖ్యానించారు.

# దూకుడు విధానాలే కారణం

మొదటి పేజీ రువాయి

హర్మూజ్ జలసంధి సమీపంలో 'సెటెబెల్లో' వాణిజ్య నౌకపై జరిగిన దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మరణించడంపై ఎంఐఎం చీఫ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు. ఈ ఘోర దాడిని తీవ్రంగా ఖండిస్తూ, అంతర్జాతీయ జలాల్లో జరుగుతున్న ఈ ఉద్రిక్తతలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న దూకుడు విధానాలే కారణమని ఆయన ఆరోపించారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని, ఆయన తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన ఇబ్బందులు సృష్టిస్తున్నాయని ఒవైసీ విమర్శించారు. అంతర్జాతీయ వివాదాలతో ఎలాంటి సంబంధం లేని మన భారతీయ నావికుల ఓడలపై దాడులు జరుగుతున్నాయని, ఈ గొడవల వల్ల మనవాళ్లు ఎంతమంది ప్రాణాలు కోల్పోతున్నారో కేంద్ర ప్రభుత్వం ఒక్కసారి ఆలోచించాలని కోరారు.అదేవిధంగా, అంతర్జాతీయ నౌకాయాన మార్గాల్లో రక్షణ కల్పించడంలో అమెరికా సెంట్రల్ కమాండ్ తీవ్రంగా విఫలమైందని ఒవైసీ మండిపడ్డారు. అత్యంత కీలకమైన హర్మూజ్ ప్రాంతంలో మన ఓడలపై దాడులు జరుగుతుంటే, అక్కడ కాపలా కాస్తున్న సెంట్‌కామ్‌కు ఆ మార్గంలో ఎన్ని వాణిజ్య నౌకలు ప్రయాణిస్తున్నాయో తెలియదా అని ప్రశ్నించారు.

# 5000 కోట్ల స్కామ్‌కు చెక్!

మొదటి పేజీ రువాయి

హైదరాబాద్ పోలీసులు సుమారు రూ. 5,000 కోట్ల భారీ ఆర్థిక మోసాన్ని సకాలంలో గుర్తించి అడ్డుకున్నారు. 'ఇగ్నైట్' పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్న మనీ సర్క్యులేషన్ నెట్‌వర్క్‌ను ఛేదించి, నలుగురు కీలక నిందితులను అరెస్టు చేశారు. అమాయక ప్రజల నుంచి భారీగా నగదు వసూలు చేసేందుకు సిద్ధమైన ఈ ముఠా కుట్రను సీసీఎస్ పోలీసులు ముందే పసిగట్టారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ మీడియాకు వెల్లడించారు.ఈ వ్యవహారంలో హైదరాబాద్ పోలీసులు 'ఆపరేషన్ ఇగ్నైట్ క్రాక్‌డౌన్' పేరిట ప్రత్యేక చర్యలు చేపట్టారు. కేరళ, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. సదరు సంస్థ భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన కేవలం 18 రోజుల్లోనే పోలీసులు రంగంలోకి దిగి, పెను నష్టం జరగకుండా నివారించడం విశేషం.గతంలో నిషేధానికి గురైన క్యూనెట్, విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ నెట్‌వర్క్‌ల నిర్వాహకులే 'ఇగ్నైట్' పేరిట ఈ సరికొత్త మోసానికి తెరలేపినట్లు సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) దర్యాప్తులో వెల్లడైంది. గత మూడు దశాబ్దాలుగా ఈ ముఠా వరుసగా గోల్డ్ క్వెస్ట్, క్వెస్ట్‌నెట్, క్యూనెట్, తాజాగా ఇగ్నైట్ రూపంలో వివిధ పేర్లతో ప్రజలను వంచిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు బాధితులు ఫిర్యాదు చేయగా, పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. భారీస్థాయిలో ప్రజలు ఆర్థికంగా నష్టపోకముందే ఇలాంటి మనీ సర్క్యులేషన్ రాకెట్లను గుర్తించి, వాటిని నిర్మూలించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సీపీ సజ్జనార్ వివరించారు.

# నన్ను ఈడీ అరెస్ట్ చేయలేదు..

మొదటి పేజీ రువాయి

తమను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్ట్ చేశారంటూ వస్తున్న వార్తలను ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. "నన్ను ఈడీ అరెస్ట్ చేయలేదు.. ఉదయం నుంచి నేను ఇంట్లోనే ఉన్నాను. నా అరెస్ట్‌పై జరుగుతున్న ప్రచారమంతా పూర్తిగా అవాస్తవం" అని ఆయన స్పష్టం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు.ఏపీ లిక్కర్ స్కాం కేసులో భాగంగా గురువారం హైదరాబాద్‌లో నిందితుల ఇళ్లలో ఈడీ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలోనే మద్యం రవాణా కాంట్రాక్టు, టెండర్ల వ్యవహారంలో జరిగిన అక్రమాల కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కెసిరెడ్డిని అధికారులు అరెస్ట్ చేశారు.ఈ కేసులో నిందితుడిగా ఉన్న కారుమూరి నాగేశ్వరరావును కూడా ఈడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారంటూ సోషల్ మీడియా, కొన్ని మీడియా సంస్థల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో ఆయన స్పందిస్తూ, తన అరెస్ట్ వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశారు.

# ప్రధాని మోదీతో డీకే శివకుమార్ భేటీ

మొదటి పేజీ రువాయి

కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం డీకే శివకుమార్ తొలిసారిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. గురువారం ఢిల్లీలో ఈ భేటీ జరిగింది. కర్ణాటక రాష్ట్ర అభివృద్ధికి, ముఖ్యంగా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందించాలని ఈ సందర్భంగా ఆయన ప్రధానిని కోరారు.జూన్ 3న ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన శివకుమార్, తన ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన 11వ నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో పాల్గొన్నారు. గత ప్రభుత్వం నీతి ఆయోగ్ సమావేశాలను బహిష్కరించగా, అందుకు భిన్నంగా శివకుమార్ ఈ సమావేశానికి హాజరుకావడం ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్రంతో సమన్వయంతో పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందనే సంకేతాలను ఆయన ఈ సందర్భంగా ఇచ్చారు.ప్రధానితో భేటీకి ముందు శివకుమార్ కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో సమావేశమయ్యారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎలివేటెడ్ కారిడార్లు, పెరిఫెరల్ రింగ్ రోడ్లు, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి అవసరమైన సహాయ సహకారాలను అందించాలని కోరారు. బెంగళూరు మెట్రో ఫేజ్-2 సవరించిన అంచనాలకు, అలాగే ఫేజ్-3 ప్రాజెక్టుకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు బెంగళూరు నుంచి మైసూరు, తుమకూరు, కోలార్ నగరాలను అనుసంధానిస్తూ రీజినల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ ఏర్పాటుపై కూడా చర్చించారు.ప్రధాని మోదీతో జరిపిన చర్చలు అత్యంత ఫలప్రదంగా, నిర్మాణాత్మకంగా సాగాయని శివకుమార్ వెల్లడించారు. రాష్ట్ర సంక్షేమం, ప్రగతి కోసం కేంద్రం నుంచి పూర్తి సహకారం ఉంటుందని గతంలో ప్రధాని ఇచ్చిన హామీని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

మొదటి పేజీ రువాయి

తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యార్థులకు ముఖ్యమైన అప్‌డేట్. తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ (౦+దీ×జు) ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల (ఞూూజు) 2026 ఫలితాలను విడుదల చేసింది. మే 13 నుంచి మే 21 వరకు జరిగిన ఈ పరీక్షలకు హాజరైన ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులు తమ ఫలితాలను ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు.ప్రధాన పరీక్షల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సబ్జెక్టులలో ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థుల కోసం బోర్డు ఈ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించింది. జనరల్, ఒకేషనల్ విభాగాలకు చెందిన మొదటి, రెండో సంవత్సరం ఫలితాలను ఒకేసారి అందుబాటులో ఉంచారు. విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబర్‌ను ఉపయోగించి మార్కుల మెమోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఫలితాలు చెక్ చేసుకునే విధానం:

ముందుగా అధికారిక వెబ్‌సైట్లయిన tgbie.cgg.gov.in లేదా results.cgg.gov.in సందర్శించాలి.

హోమ్‌పేజీలో కనిపించే 'IPASE 2026 Result' లింక్‌పై క్లిక్ చేయాలి.

ఆ తర్వాత ఫస్ట్ ఇయర్ లేదా సెకండ్ ఇయర్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి.

జనరల్ లేదా ఒకేషనల్ స్ట్రీమ్‌ను ఎంపిక చేసుకుని, మీ హాల్ టికెట్ నంబర్‌ను ఎంటర్ చేయాలి.

'Submit' బటన్‌పై క్లిక్ చేయగానే మీ మార్కుల మెమో స్క్రీన్‌పై కనిపిస్తుంది.

భవిష్యత్ అవసరాల కోసం ఈ మార్కుల మెమోను డౌన్‌లోడ్ చేసుకుని, ప్రింట్ తీసుకోవడం మంచిది.

# ట్యాంకర్‌పై అమెరికా దాడి..

మొదటి పేజీ రువాయి

గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో అమెరికా సైనిక బలగాలు జరిపిన దాడిలో ముగ్గురు భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంకు చెందిన వ్యక్తి ఉండటంతో ఆ ప్రాంతంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనపై భారత్ తీవ్రంగా స్పందించడమే కాకుండా, అమెరికా ప్రభుత్వానికి తన నిరసనను బలంగా తెలియజేసింది.జూన్ 10న 'ఎంటీ సెటెబెల్లో' అనే చమురు ట్యాంకర్‌పై అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) దాడి చేసింది. ఇరాన్‌పై విధించిన ఆంక్షలను ఉల్లంఘిస్తూ చమురు రవాణా చేస్తున్నారని, తమ ఆదేశాలను పాటించకపోవడంతోనే నౌకలోని ఇంజిన్ రూమ్‌ను లక్ష్యంగా చేసుకుని దాడికి పాల్పడినట్లు అమెరికా ప్రకటించింది. ఈ దాడి ప్రభావంతో నౌకలో భారీగా మంటలు చెలరేగాయి.ఈ దుర్ఘటనలో విశాఖకు చెందిన చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేష్ (44), డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ, ఫిట్టర్ శివానంద్ చౌరాసియా మరణించారు. సురేష్‌కు భార్య భార్గవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మరికొద్ది రోజుల్లో తన 15వ వివాహ వార్షికోత్సవం జరుపుకోవాల్సి ఉండగా ఈ విషాదం చోటుచేసుకుంది. తన భర్త శాశ్వతంగా దూరం కావడంతో భార్య భార్గవి కన్నీరుమున్నీరవుతున్నారు. గత ఐదు నెలలుగా విధుల్లో ఉన్న సురేశ్ త్వరలోనే ఇంటికి రావాల్సి ఉందని, ఇందుకోసం ఆయన ఇప్పటికే అనుమతి కూడా పొందినట్లు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# నౌకలపై దాడులు ఆపండి

మొదటి పేజీ రువాయి

కారణంగా భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోవడంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా జరిపిన ఓ దాడిలో ముగ్గురు భారతీయులు మరణించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇటువంటి దాడులను వెంటనే నిలిపివేయాలని, దౌత్య మార్గాల ద్వారా శాంతిని నెలకొల్పాలని భారత విదేశాంగ శాఖ పిలుపునిచ్చింది.బుధవారం ఒమన్ తీరంలో 'ఎంటీ సెటెబెల్లో' అనే ఆయిల్ ట్యాంకర్‌పై అమెరికా బలగాలు దాడి చేశాయి. అమెరికా ఆంక్షలను ఉల్లంఘించి, ఈ నౌక ఇరాన్ నుంచి చమురు రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ దాడిలో డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ, ఇంజిన్ ఫిట్టర్ శివానంద్ చౌరాసియా, చీఫ్ ఇంజనీర్ పట్నాల సురేష్ అనే ముగ్గురు భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోయారు. నౌకలోని మరో 21 మంది భారత సిబ్బందిని సురక్షితంగా రక్షించారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన భారత్, న్యూఢిల్లీలోని అమెరికా రాయబారికి సమన్లు జారీ చేసి తన నిరసనను వ్యక్తం చేసింది.గడిచిన కొద్ది రోజుల్లో భారతీయులు ఉన్న మూడు నౌకలపై దాడులు జరిగినట్లు షిప్పింగ్ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. జూన్ 8న 'మారివెక్స్' నౌకలో మంటలు చెలరేగగా, అందులోని 24 మంది భారత సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. గురువారం షినాస్ పోర్టు వద్ద 'ఎంటీ జల్వీర్' నౌకపై దాడి జరగ్గా, ఒమన్ అధికారులు స్పందించి 20 మంది భారత సిబ్బందిని రక్షించారు.వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడాన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. నావికుల భద్రతకు, అంతర్జాతీయ జలాల్లో నౌకల స్వేచ్ఛాయుత ప్రయాణానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్ నొక్కి చెప్పింది. ప్రస్తుతం హర్మూజ్ జలసంధిలో 13 భారతీయ నౌకలు, 562 మంది భారత నావికులు ఉన్నారని అధికారులు తెలిపారు. ప్రభావిత సిబ్బందికి అవసరమైన సహాయం అందించేందుకు ఒమన్ అధికారులతో భారత ప్రభుత్వం నిరంతరం సమన్వయం చేసుకుంటోంది.

# కవిత కొత్త పార్టీకి పేరు చిక్కులు..

మొదటి పేజీ రువాయి

14 ఏళ్ల తెలంగాణ ఉద్యమ చరిత్రతో, ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ తమ పార్టీని ప్రజలు 'టీఆర్ఎస్'గానే గుర్తిస్తున్నారని, కాబట్టి ఆ పేరును వేరొకరికి కేటాయించవద్దని కోరుతూ ఈసీకి అధికారికంగా ఫిర్యాదు చేసింది.మరోవైపు, కవిత పార్టీ ప్రకటనకు ఒక రోజు ముందే మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన 'తెలంగాణ రాష్ట్రసామాజిక సేన' అనే సంస్థ కూడా 'టీఆర్ఎస్' అనే పేరు కోసం ఈసీకి దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. సోలాపూర్‌కు చెందిన దయానంద్ మహాదేవ్ మామ్‌డ్యాల్ ఈ మేరకు దరఖాస్తు చేసినట్లు తెలియవచ్చింది.ఇవి మాత్రమే కాకుండా, కవిత పత్రికల్లో ఇచ్చిన ప్రకటన ఆధారంగా సుమారు 600 నుంచి 700 వరకు ప్రజా అభ్యంతరాలు ఈసీకి అందినట్లు సమాచారం. అదే సమయంలో, రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఇప్పటికే 'తెలంగాణ రాజ్య సమితి' పేరుతో నమోదైన మరో పార్టీ కూడా 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త నామాన్ని వాడటంపై అభ్యంతరం తెలుపుతూ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది.ఈ పరిణామాల నేపథ్యంలో, తమ వాదనలు వినిపించేందుకు కవిత ప్రతినిధుల బృందం త్వరలో ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు సిద్ధమవుతోంది. ఒకే పేరుపై ఇన్ని వైపుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్న తరుణంలో కవిత తన కొత్త పార్టీకి 'టీఆర్ఎస్' పేరును దక్కించుకుంటారా లేదా అన్నది ఇప్పుడు తీవ్ర ఉత్కంఠ రేపుతోంది.

# ప్రత్యేక ప్రణాళికతో వెళ్తున్నాం

మొదటి పేజీ రువాయి

పేర్కొన్నారు.గురువారం హుస్నాబాద్ బస్టాండ్‌ని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడి బస్సుల వివరాలు, మౌలిక సదుపాయాలు గురించి అడిగి మంత్రి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. పెరుగుతున్న పట్టణానికి అనుగుణంగా ఇంజినీరింగ్ కాలేజీ, టూరిజం, మెడికల్ కాలేజీ ఇండస్ట్రీయల్ కారిడార్ ద్వారా అభివృద్ధి జరుగుతుందని వివరించారు. ప్రయాణికుల సంఖ్య.. బస్టాండ్ రెవెన్యూ పరంగా ముందుందని తెలిపారు. ప్రతిరోజూ 35 వేల మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి వెళ్తుంటారని చెప్పుకొచ్చారు. హుస్నాబాద్ బస్టాండ్‌ని పెద్ద షాపింగ్ మాల్‌గా అభివృద్ధి చేస్తామని.. మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# విద్యారంగ సమస్యలపై ఏ.ఐ.ఎస్.యఫ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, నారాయణఖేడ్ :**
ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధ్యాయ ఖాళీల భర్తీ, విద్యా హక్కు చట్టం అమలు, ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల నియంత్రణ తదితర అంశాలపై ఏ ఐ యస్ యఫ్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి దత్తు రెడ్డి అధ్యక్షతన నారాయణఖేడ్ పట్టణంలోని అంబేద్కర్ భవన్లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశానికి హాజరైన విద్యావేత్తలు, ప్రజా సంఘాల నాయకులు, ఉపాధ్యాయ ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వ విద్య ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏ ఐ యస్ యఫ్ జిల్లా కార్యదర్శి దత్తు రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేయడం వల్ల పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు, ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీ వంటి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న పలువురు వక్తలు ప్రభుత్వ విద్యను బలోపేతం చేయకుండా సమాన విద్యా వ్యవస్థ సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలకు తాగునీరు, మరుగుదొడ్లు, లైబ్రరీలు, ప్రయోగశాలలు, డిజిటల్ తరగతి గదులు వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

**సమావేశంలో ప్రధానంగా చేసిన డిమాండ్లు:**
ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. విద్యా హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలి. ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఈ సమావేశంలో వచ్చిన సూచనలు, అభిప్రాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి విద్యారంగ పరిరక్షణ కోసం విస్తృత ఉద్యమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నారాయణఖేడ్ మండలం కార్యదర్శి శ్రీరామ్ నాయక్,యన్ యస్ యూ ఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి బిఆర్ఎస్వి జిల్లా నాయకులు అశోక్ రెడ్డి, ఆర్.పి.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అలిగే జీవన్, బీఎస్పీ నాయకులు పండరి, వివిధ ప్రజాసంఘాల నాయకులు రవీందర్ నాయక్, సాయిరాం, పుప్పాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలోనే ఆదర్శ మార్కెట్‌గా పటాన్చెరు వ్యవసాయ మార్కెట్

**అతి త్వరలో మేకల మండి, చేపల మార్కెట్ నిర్మాణం.**
**త్వరితగతిన దుకాణాల సముదాయాల నిర్మాణ పనులు.**
**ఎటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**





**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11 :**
పటాన్చెరు ప్రాంత అభివృద్ధి, వ్యాపార విస్తరణ, మరియు ఉపాధి అవకాశాల పెంపు లక్ష్యంగా పటాన్చెరు వ్యవసాయ మార్కెట్ సమగ్ర అభివృద్ధి కోసం ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పర్యటించారు. యార్డు పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పది సంవత్సరాల క్రితం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో వ్యవసాయ మార్కెట్ యార్డు ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. నాటి నుండి నేటి వరకు మార్కెట్ అభివృద్ధికి దశలవారీగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకొని వెళ్తున్నామని తెలిపారు. 20 కోట్ల 46 లక్షల రూపాయల అంచనా వ్యయంతో 172 దుకాణాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. నిర్దేశించిన గడువుల్లోగా వీటిని పూర్తి చేసి లైసెన్స్ వ్యాపారస్తులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మేకల మండి, చేపల మార్కెట్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మేకల మండితో పాటు ఆధునిక స్లాటర్ హౌస్‌తో పాటు ఎస్‌టీపీ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. మార్కెట్‌లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు మార్కెట్ ఆదాయాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ దీర్ఘకాలిక మాస్టర్ ప్లాన్ అమలు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. వ్యాపారులు, స్థానిక ప్రజలు, రైతులు, ప్రజాప్రతినిధులు మరియు అధికారుల సహకారంతో మార్కెట్‌ను తెలంగాణ రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన, నంబర్ వన్ మార్కెట్‌గా అభివృద్ధి చేస్తామని చెప్పారు. మేకల మండి ఏర్పాటు కోసం మార్కెట్ సమీపంలోని రైల్వే శాఖకు చెందిన 38 ఎకరాలను మార్కెట్ శాఖకు బదలాయించాలని గతంలో అప్పటి మెదక్ పార్లమెంటు సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి ద్వారా కేంద్రానికి విన్నవించడం జరిగిందని తెలిపారు. అతి త్వరలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి భూమి కేటాయింపు అంశం పైన చర్చించడం జరుగుతుందని తెలిపారు. మార్కెట్ ఆదాయం పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మార్కెటింగ్ విభాగం డిఈ రవీందర్, మార్కెట్ కార్యదర్శి సునీల్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, వ్యాపారులు, తదితరులు పాల్గొన్నారు.

# అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం...!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, జహీరాబాద్:**
రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో కోహిర్ మండలంలోని సజ్జపూర్, బడంపేట్ గ్రామ ప్రజలు విద్యార్థుల ఆధ్వర్యంలో పలు అవగాహన సదస్సులు, గ్రామ సభలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అటవీ సంపదను కాపాడటం, పెద్ద ఎత్తున మొక్కలు నాటడం మరియు పచ్చదనాన్ని పెంపొందించడం ఈ సమావేశాల యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. అటవీ శాఖ కార్యక్రమాల్లో మొక్కల పెంపకం అర్బన్ పార్కులు గ్రామ శివార్లలో ప్రజా ప్రతినిధులు, అటవీ శాఖ సిబ్బంది మరియు స్థానికుల భాగస్వామ్యంతో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు. పర్యావరణ అవగాహన పర్యావరణ పరిరక్షణ, అటవీ భూముల పరిరక్షణ మరియు ప్లాస్టిక్ వాడకం తగ్గించడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సజ్జపూర్, బడంపేట్, గ్రామ సర్పంచులు, అధికారులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయంతో ఈ సమావేశం విజయవంతం చేశారు. రాష్ట్రంలో 99 రోజుల పాటు జరుగుతున్న ఈ ప్రగతి ప్రణాళికలో భాగంగా అన్ని



శాఖలతో పాటు అటవీ శాఖ కూడా కీలక పాత్ర పోషిస్తోందని పచ్చదనం మరియు సుస్థిర అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొంటుంది అన్నారు. అనంతరం బడంపేట్ రచ్చన్న స్వామి దేవాలయం ఆవరణంలో సంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ కవిత, ప్లాంటేషన్ మేనేజర్ నీలకంఠం, అటవీ శాఖ అధికారులు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వేద పాఠశాలకు శ్రీకారం..!

**వైభవంగా ఇష్టలింగ పూజ.**
**హాజరైన బీదర్ సౌత్ ఎమ్మెల్యే డా. శైలేంద్ర బెల్దాలే**





**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, జహీరాబాద్ :**
భారతీయ సనాతన ధర్మ పరిరక్షణకు వేద పాఠశాలలు ఎంతో అవసరమని దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ 1008 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా బర్దిపూర్‌లోని దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో, అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం దేవస్థానంలో ఇప్పటికే వేద పాఠశాలలు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. గురువారం బీదర్ జిల్లా చౌళి గ్రామంలోని శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ ఆవరణలో నూతన వేద పాఠశాల నిర్మాణానికి బీదర్ సౌత్ ఎమ్మెల్యే డా. శైలేంద్ర బెల్దాలే చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమంలో అధిక జ్యేష్ఠ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న మహామండలేశ్వర్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్ చేపట్టిన ఇష్టలింగ పూజలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శిఖర పూజ, రుద్రయజ్ఞం, మహా మంగళహారతి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డా. శైలేంద్ర బెల్దాలే దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆశ్రమ పీఠాధిపతులు, అర్చకులు ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. బీదర్ జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దత్తగిరి ఉత్సవ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమంలో శివశ్రీ సుమంగళ్‌తో పాటు వివిధ గ్రామాల ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

# కాలనీ సమస్యలపై మాజీ కార్పొరేటర్ కీ వినతి పత్రం

***మచ్చ బొల్లారం 190 డివిజన్ సిటిజన్ కాలనీ రోడ్ నం.10 సమస్యలపై***



**అల్వాల్, జూన్ 11,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
అల్వాల్ సర్కిల్ మచ్చ బొల్లారం 190 డివిజన్ సిటిజన్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మరియు పలువురు సభ్యులు మాజీ కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్‌ను కలిసి రోడ్ నెం. 10 లో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఇటీవల ఆ ప్రాంతంలో డ్రైనేజీ పైప్ లైన్ ఏర్పాటు పనులు చేపట్టడంతో రహదారి దెబ్బతిని, వర్షపు నీరు నిల్వ ఉండే పరిస్థితి ఏర్పడిందని వారు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ, రహదారిని తక్షణమే పునరుద్ధరించి కొత్తగా వేయాలని కోరారు. వినతి పత్రాన్ని స్వీకరించిన కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ సమస్యను పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లి అవసరమైన పనులు వీలైనంత త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిటిజన్ కాలనీ నివాసితులు ప్రసన్న కుమార్, భిక్షపతి రెడ్డి, నీలవేణి, విక్కీ తదితరులు పాల్గొన్నారు.

# కాలనీలలో పలు ప్రజా సమస్యలపై నిరంతర కృషి : మాజీ కార్పొరేటర్

**శ్రీరామ ఎన్‌క్లేవ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లో పర్యటన**



**ఓల్డ్ బోయిన్పల్లి, జూన్ 11,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
ఓల్డ్ బోయిన్పల్లి 262 డివిజన్ పరిధిలోని కళింగ ఎంక్లేవ్ శ్రీ రామ ఎన్‌క్లేవ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తమ కాలనీలో నెలకొన్న పలు ప్రజా సమస్యలను ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కాలనీని స్వయంగా సందర్శించిన ముద్దం నర్సింహ యాదవ్ స్థానిక కాలనీ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటు, డ్రైనేజీ సమస్యల పరిష్కారం, ర్యాంప్ నిర్మాణం, వీధుల పారిశుద్ధ్యం, మొక్కల వ్యర్థాల తొలగింపు, రోడ్లపై పార్కింగ్ సమస్య నియంత్రణ, దోమల నివారణ కోసం ఫాగింగ్ నిర్వహణ, తాగునీటి సమస్య వంటి అంశాలపై అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన ముద్దం నర్సింహ యాదవ్ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఈ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకురాలు ఉదయ రాణి, శ్రీరామ కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజేశ్వర రావు, సెక్రటరీ నాగేశ్వర ప్రసాద్, భాస్కర రెడ్డి, యమునా చారి, వీరయ్య, నరసింహ, నవీన్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

# యశ్వీర్ అండర్ 19 క్రికెట్ టీమ్ కు ఎంపిక...



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
రాజపేట గ్రామానికి చెందిన ఊట్కూరు యశ్వీర్ గౌడ్ అండర్ 19 వన్డే టీంకు ఎంపికయ్యాడు. బంతితో తిప్పుతూ, బ్యాటుతో బాదుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచి యశ్వీర్ గౌడ్ శ్రీలంక టూరుకు ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు అభినందించారు. రాజపేట సంస్తానానికి, యాదాద్రి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి ఆడుతూ విజయాలు సొంతం చేసుకొని దేశం గర్వపడేలా ఎదగాలని పలువురు కోరారు.

# గృహిణులను కేవలం హోమ్ మేకర్స్‌గా చూడొద్దు.. వారు 'దేశ నిర్మాతలు' : సుప్రీంకోర్టు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, సెంట్రల్ బ్యూరో :**
కోట్లాదిమంది గృహిణుల విషయంలో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. గృహిణులను కేవలం హోమ్ మేకర్స్‌గా చూడొద్దని తెలిపింది. వారిని దేశ నిర్మాతలుగా గుర్తించాలని వ్యాఖ్యానించింది. దానికి తగ్గట్టుగా పరిహారం చెల్లించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఈ మేరకు కీలక మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. గృహిణి సేవలను కనీసం 30 వేల రూపాయల ఆదాయంగా పరిగణించాల అందులో పేర్కొంది.జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కె. సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు ఇచ్చింది. ప్రతిఫలం ఆశించకుండా గృహిణులు ఇంట్లో చేసే పనుల వెనుక ఉన్న ఆర్థిక ప్రాముఖ్యతను కోర్టు నొక్కి చెప్పింది. "గృహిణులు కుటుంబానికి ఎంతో సహకారం అందిస్తారు. వారు నిజమైన జాతి నిర్మాతలు. దేశ నిర్మాణంలో వారిది కీలక పాత్ర. అలాంటప్పుడు వారి సహకారం, సేవల్ని మీరు డబ్బుతో ఎలా కొలుస్తారు..? 'హోమ్ మేకర్' అనే పదం ఇకపై 'దేశ నిర్మాత' అనే సంక్షిప్త రూపాన్ని సంతరించుకోవాలి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు లేదా నష్టపరిహారాన్ని లెక్కించాల్సి వచ్చినప్పుడు గృహిణుల గృహ సంరక్షణ సేవల నష్టాన్ని ఒక ప్రత్యేక అంశంగా పరిగణించాలని కోర్టు ఈ సందర్భంగా అభిప్రాయపడింది. దానికి అనుగుణంగా వారి నెలవారీ ఆదాయాన్ని రూ. 30,000గా నిర్ధారించింది. ఈ విషయమై గతంలోనూ అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశామని గుర్తు చేసిన ధర్మాసనం.. దేశంలోని అన్ని హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు ఈ అంశాన్ని నిరంతరం పర్యవేక్షిస్తారని ఆశిస్తున్నట్లు కోర్టు పేర్కొంది.

# ఏకాదశి సందర్భంగా హరే రామ హరే కృష్ణ నగర సంకీర్తన.....



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
రాజపేట మండల రేణికుంట గ్రామంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మర్కుక్ శ్రీ పాండురంగ ఆశ్రమం ఆధ్వర్యంలో శ్రీ అదరాసుపల్లి శ్రీధర్ శర్మ పర్యవేక్షణలో రేణికుంట గ్రామంలోని అతి పురాతనమైన మహిమాన్వితమైన శ్రీ భవానీ శంకరస్వామి శివాలయం నుండి ఏకాదశి హరే రామ హరే కృష్ణ నామ నగర సంకీర్తన శ్రీ పరాభావ నామ సంవత్సర అధిక జ్యేష్ఠ మాస ఏకాదశి గురువారం ఉదయం 5:30 నుండి రేణికుంటలోని పురవీదుల గుండా హరే రామ హరే కృష్ణ కీర్తన చేస్తు నగర సంకీర్తన నిర్వహించటం జరిగింది. ముందుగా ఆలయ అర్చకులు శ్రీ రేగొండ పాండురంగం ఏకాదశి పురస్కరించుకుని శ్రీ భవానీ శంకరస్వామి వారికి పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించటం జరిగింది. శ్రీ తలిశెట్టి మారుతి (సూర్యపేట) ప్రసాదం అందించగా స్వామివారికి నివేదన చేయటం జరిగింది. నగర సంకీర్తన తదనంతరం ఆలయ అర్చకులు మాట్లాడుతు... అధిక మాసంలో ఏది చేసిన అధిక ఫలం ఉంటుంది కావున ముఖ్యంగా ప్రతి రోజు **హరేరామ హరేరామ రామరామ హరేహరే హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే**
మంత్రాన్ని వీలైన సమయంలో పలుమార్లు జపం చేసి భగవత్ కృపా పొంది తరించాలని తెలియచేయటం జరిగింది. తదనంతరం భవానీ శంకర లింగ మూర్తికి మంగళ నీరాజనం సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేయటం జరిగింది.

# జూన్ లో 'కేరళ' ట్రిప్.. ప్రకృతి ఒడిలో రీఫ్రెష్..!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11 :**
పచ్చని ప్రకృతి.. ఆహ్లాదకరమైన వాతావరణం.. ప్రశాంతత.. ఈ మాటలు వినగానే టక్కున గుర్తొచ్చే పేరు కేరళ.. అందుకే కేరళను 'గాడ్స్ ఓన్ కంట్రీ' అని పిలుస్తుంటారు. ప్రశాంతమైన బ్యాక్ వాటర్స్, పశ్చిమ కనుమలు, అబ్బుర పరిచే సుగంధ ద్రవ్యాల తోటలు, అందమైన బీచ్ లు కేరళ సొంతం.. ముఖ్యంగా వర్షాకాలంలో ఇక్కడి ప్రకృతి అందాలు, పచ్చని తివాచీ పరిచినట్లు ఉండే కొండలు, కోనలు.. ప్రశాంతమైన వాతావరణం పర్యాటకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తాయి. కేరళలో అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. వాటిలో మున్నార్ ఒకటి.. కేరళలో అత్యంత ప్రజాదరణ పొందిన హిల్ స్టేషన్ మున్నార్.. ఇక్కడి టీ తోటలు, పొగమంచు కొండలు పర్యటకులను మంత్రముగ్ధుల్ని చేస్తాయి. అలాగే ఇక్కడ ఎవరికులం నేషనల్ పార్క్, మట్టుపెట్టి డ్యామ్, ఆనముడి శిఖరం ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి.అలెప్పీ ప్రాంతాన్ని వెనిస్ ఆఫ్ ది ఈస్ట్ గా అభివర్ణిస్తుంటారు. కేరళ బ్యాక్ వాటర్స్ కు ఈ ప్రాంతం గుండెకాయ వంటిది. ఇక్కడ హౌజ్ బోట్ ప్రయాణం, పున్నమడ లేక్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. వర్షంలో బ్యాక్ వాటర్స్ లో కొబ్బరి చెట్ల మధ్య నుంచి హౌస్ బోట్ లో జర్నీ జీవితంలో మర్చిపోలేని అనుభూతిని ఇస్తుంది. ఇక పచ్చని అడవులు, జలపాతాలు, గుహలతో వయనాడ్ ప్రాంతం పర్యటకులకు స్వర్గధామంగా అనిపిస్తుంది. ఇక్కడ ఎడక్కల్ గుహలు, బాణాసుర సాగర్ డ్యామ్, చెంబ్రా పీక్ అలాగే వన్యప్రాణుల వీక్షణ, ట్రెక్కింగ్ మరచిపోలేని అనుభూతిని మిగులుస్తాయి.ఇక అరేబియా సముద్రపు రాణిగా కొచ్చి ప్రాంతాన్ని పిలుస్తుంటారు. ఫోర్ట్ కొచ్చి, చైనీస్ ఫిషింగ్ నెట్స్, మట్టంచేరి ప్యాలెస్, జ్యూ టౌన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అలాగే తేవడి లో స్పైస్ ప్లాంటేషన్స్ ఉన్నాయి. అడవిలోని పచ్చదనాన్ని ఎంజాయ్ చేయడానికి ఇది బెస్ట్ స్పాట్ అని చెప్పొచ్చు. ఇక అతిరపల్లి జలపాతం జూన్ లో వర్షాల సమయంలో అత్యంత ఉధృతంగా, మహాద్భుతంగా కనువిందు చేస్తుంది. సాధారణంగా కేరళను సందర్శించడానికి అక్టోబర్ నుంచి మార్చి వరకు వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇక వర్షాకాలం అందాలను వీక్షించాలనుకునేవారికి జూన్ నుంచి ఆగస్టు వరకు చాలా ప్రశాంతంగా ఉంటుంది.

# హర్మ్మాజ్‌ను పూర్తిగా మూసేసిన ఇరాన్.. ఇంధన ధరలు మళ్లీ పెరిగే ఛాన్స్..?



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, సెంట్రల్ డెస్క్ :**
పశ్చిమాసియాలో యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చింది. ఇరాన్‌పై అమెరికా దళాలు భీకర దాడులు చేస్తున్నాయి. అదే సమయంలో టెహ్రాన్ సైతం గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలను టార్గెట్ చేసింది. ఈ దాడుల నేపథ్యంలో ఇరాన్ తాజాగా కీలక ప్రకటన చేసింది. ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హర్మ్మాజ్ జలసంధిని పూర్తిగా మూసివేసినట్లు ప్రకటించింది. తమ హెచ్చరికలకు బేఖాతరు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించింది. ఈ క్రమంలోనే హర్మ్మాజ్‌ను దాటేందుకు ప్రయత్నించిన రెండు నౌకలపై టెహ్రాన్ దాడి కూడా చేసింది.ఈ మేరకు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాంతంలో భద్రతా పరిస్థితులు దెబ్బతిన్న నేపథ్యంలో హర్మ్మాజ్‌ను పూర్తిగా మూసివేసినట్లు తెలిపింది. చమురు ట్యాంకర్లు, వాణిజ్య నౌకలు సహా ఏ నౌకైనా ఈ మార్గంలో ప్రయాణించేందుకు ప్రయత్నిస్తే లక్ష్యంగా చేసుకుంటామని స్పష్టం చేసింది. ఇరాన్ తాజా చర్యతో అంతర్జాతీయ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఇరాన్ ప్రకటన భారత్‌పై పడే ప్రభావం మరింత ఎక్కువగా ఉండనుంది. మన దేశం తన ముడి చమురు అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతి చేసుకుంటుంది. ఇందులో సగానికి పైగా హర్మ్మాజ్ గుండానే సరఫరా అవుతుంది. భారత్ తన (లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్) అవసరాల్లో దాదాపు 60 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. అందులో ఎక్కువ భాగం ఈ జలసంధి గుండానే రవాణా అవుతోంది. అంతేకాదు, పెట్రోల్, డీజిల్, సహజ వాయువు ఈ మార్గం గుండానే సరఫరా అవుతోంది. దీంతో భారత్‌పై ఆ ప్రభావం తీవ్రంగా పడే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఫలితంగా మరోసారి ఇంధన ధరలు పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**డీఈఓ కార్యాలయంలో సూపర్డెంట్ కి వినతి పత్రం అందజేసిన ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సిహెచ్ అశోక్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, నారాయణ ఖేడ్ :**
అశోక్ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలోని అనుమతులు లేకుండా మరియు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అలాగే ప్రవేట్ పాఠశాలలలో బుక్స్ మరియు యూనిఫామ్స్ అమ్ముతున్న పాఠశాలలకు గుర్తింపు రద్దు చేయాలని ఆయన మండిపడ్డారు మరియు ఎక్కువ ఫీజులు వసూలు చేస్తూ అమాయకమైన పేరెంట్స్ వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. ఎందుకంటే ఈనెల 15 నుంచి అన్ని పాఠశాలలు పునర్ ప్రారంభించబడుతున్నాయి. కాబట్టి ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలు సక్రమంగా నడవాలని ఆయన డీఈవో కార్యాలయంలో హ్యాపీ పత్రం ఇవ్వడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సతీష్, రాజ్ కుమార్, అనూక్, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు

# బోయినపల్లి పీస్ పరిధిలో వ్యక్తి అనుమానస్పద మృతి



**ఓల్డ్ బోయినపల్లి, జూన్ 11,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజరాజేశ్వరి నగర్ లో రోడ్ నెం 4/2 లో ఫ్యాకర్స్ అండ్ మూవర్స్ ను నడిపిస్తున్న సౌరభ్ సింగ్. వివరాల్లోకి వెళితే..యుపి వాసి సౌరభ్ సింగ్ (25) గత కొద్ది రోజుల నుండి మానసిక పరిస్థితి బాగా లేక మనస్తాపానికి గురై ఆర్.ఆర్ నగర్లోని అతని కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం ఎవరు లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. బయటకు వెళ్లి వచ్చిన అతని తమ్ముడు కార్యాలయంలో కి వెళ్లి చూడగా ఫ్యాన్ కు ఉరి వేసుకుని వేలాడుతున్న అన్నను గమనించి కిందకు దింపాడు. ఏమి చేయాలో అర్థం కాక అన్న శవం ముందు కూర్చుని బోరున విలపించడం తో అరుపులు విన్న స్థానికులు వెంటనే వెళ్లి చూసి బోయిన్ పల్లి పోలీస్ లకు సమాచారం అందించారు. సంఘటన స్థలికి చేరుకున్న పోలీస్ లు దర్యాప్తు ప్రారంభించారు.

# రేణికుంటలో ఇంటి ఇంటికి ప్రభుత్వ బడిబాట ప్రచారం....

**ప్రైవేటు పాఠశాల వద్దు... ప్రభుత్వ పాఠశాల ముద్దు**





**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం రేణికుంట గ్రామంలో అమ్మ మాట అంగన్వాడి బాట, ఇంటి ఇంటికి ప్రభుత్వ బడిబాట ప్రచార కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ కర్రే వెంకటేష్, ఉపసర్పంచ్ బోళ్ల హర్షవర్ధన్ రెడ్డి, వార్డు సభ్యులు బొడ్డు కళ్యాణి, పోసుగొండ ఉపేందర్, గొర్రె మల్లేశం, బొడ్డు భాస్కర్, పంచాయతీ సెక్రెటరీ వెంకట్, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం మయూరి, అంగన్వాడీ టీచర్లు దేవిక, జ్యోతి, ఆశా కార్యకర్తలు మరియు గ్రామస్తులు పోసుగొండ మధు, భాస్కర్ స్కూల్ పిల్లలు వీళ్ళందరితో గ్రామంలోని ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహిస్తూ ప్రైవేటు పాఠశాలలకు వెళ్ళే విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

# పశ్చిమ బెంగాల్‌లో సంచలనం.. కాలిబూడిదైన 4 వేల ఈవీఎం మిషిన్లు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11:**
పశ్చిమ బెంగాల్ లో రాజకీయ ఉద్రిక్తతల వేళ సంచలన ఘటన చోటుచేసుకుంది. ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచే ఓ స్ట్రాంగ్ రూమ్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాద తీవ్రతకు ఏకంగా 4 వేల ఈవీఎం మిషిన్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. తాజాగా ఈ ఘటనతో ఎన్నికల అధికారులు, స్థానిక యంత్రాంగం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ప్రమాదం జరిగిన వెంటనే స్పాట్‌కు చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేసినప్పటికీ, అప్పటికే వేల సంఖ్యలో ఉన్న ఈవీఎంలు, వాటికి సంబంధించిన వీవీప్యాట్, ఇతర పరికరాలు మంటల్లో కాలి బూడదయ్యాయి.

**కుట్ర కోణంలో దర్యాప్తు.. ఎఫ్ ఐ ఆర్ నమోదు**

ఎన్నికల సామగ్రి భద్రపరిచే అత్యంత సురక్షితమైన ప్రాంతంలో ఇలాంటి ప్రమాదం జరగడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది కేవలం ప్రమాదవశాత్తూ జరిగిన షార్ట్ సర్క్యూటా.. లేక దీని వెనుక ఏదైనా రాజకీయ కుట్ర దాగి ఉందా? అనే కోణంలో పోలీసు ఉన్నతాధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతునన్నారు. మరోవైపు భారీ సంఖ్యలో ఈవీఎంలు కాలిపోవడంతో కేంద్ర ఎన్నికల సంఘం




కూడా ఈ ఘటనపై నివేదిక కోరినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఫోరెన్సిక్ ల్యాబ్ బృందం ష?ప్ట్‌లో నమూనాలను సేకరించి పరిశీలిస్తున్నారు.

## బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ. విమల శ్రీనివాస్ రెడ్డి



**జహీరాబాద్, జూన్ 11, హైదరాబాద్ పల్స్ న్యూస్:** మండలంలోని హుగ్గెల్లి గ్రామ మండల ప్రజా పరిషత్ పాఠశాలలో గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ.విమల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.... గ్రామంలో నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న పిల్లలను గుర్తించి ప్రీ ప్రైమరీ స్కూల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులకు అవగాహన చేయడం జరిగింది అని అన్నారు. అదేవిధంగా డ్రాప్ అవుట్ అయిన పిల్లలకు మళ్ళీ పాఠశాలకు వచ్చే విధంగా ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత యూనిఫామ్, మధ్యాహ్నం భోజనంలో పౌష్టికాహారం, ఉచిత పెన్ను , పాఠ్య పుస్తకాలు, నోటుబుక్కులు కాక అదనంగా పలు సౌకర్యాలను పేద విద్యార్థులకు కల్పించడం జరుగుతుంది అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బడిబాట– విద్యాబాట, ప్రతి పిల్లవాడు బడికి రావాలి, విద్యా హక్కు – ప్రతి ఒక్కరి హక్కు, ప్రభుత్వ బడి – పిల్లల భవిష్యత్తు మేలని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలకు వెళ్లే విద్యార్థిని, విద్యార్థుల పేరెంట్స్ కు ప్రభుత్వ పాఠశాలలో పంపిస్తున్న సౌకర్యాలు వివరించి ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను పంపే విధంగా అవగాహన చేసి పలువురు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విధంగా పేరెంట్స్ కు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## స్టాటిస్టిక్స్, లైబ్రేరియన్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి:
భూదాన్ పోచంపల్లి మండల పరిధిలోని దేశ్ముఖి గ్రామంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ సైనిక మహిళ ఆర్మీ డిగ్రీ కళాశాలలో స్టాటిస్టిక్స్, లైబ్రేరియన్ పోస్టులకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి పీజీ తో పాటు పీహెచ్ డీ, నెట్, సెట్ ఉత్తీర్ణత సాధించి బోధన అనుభవం కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, అర్హత కలిగిన మహిళ అభ్యర్థులు ఈ నెల 15 లోగా నేరుగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు బయోడేటా తో పాటు సంబంధిత విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను తమ వెంట తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 7306981947,7995010687 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

## దిశా" సభ్యురాలిగా సర్పంచ్ భీమగాని రూప బాలనర్సయ్య




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం చల్లూరు గ్రామ సర్పంచ్ భీమగాని రూప బాలనర్సయ్య జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సభ్యురాలిగా నియమితులయ్యారు. భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి సిఫారసు, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రోత్సాహం, సహకారంతో, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఐఏఎస్ లు భీమగాని రూప బాలనర్సయ్యని కమిటీ సభ్యురాలిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామీణాభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాల అమలు, స్థానిక సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషిస్తున్న భీమగాని రూప బాలనర్సయ్య కి ఈ బాధ్యత దక్కడం చల్లూరు గ్రామానికి గర్వకారణంగా నిలిచిందని గ్రామస్తులు కొనియాడారు. ఈ సందర్భంగా తనకు ఈ గౌరవప్రదమైన అవకాశం కల్పించిన నేతలకు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా దిశా కమిటీ సభ్యురాలిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి జిల్లా, గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

# పార్టీ బలోపేతానికి ఎన్నికల నిర్వహణలో బీఎల్ఏ ల పాత్ర అత్యంత కీలకమైనది...

**భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ప్రత్యేక సమగ్ర సవరణ పై ఆలేరు నియోజకవర్గ స్థాయి బీఎల్ఏ అవగాహన ల శిక్షణ సదస్సులో పాల్గొన్న ఎంపీ చామల, ఈ కార్యక్రమం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో బీఎల్ఏ ల అవగాహన మరియు శిక్షణ సదస్సు కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. యాదాద్రి భువనగిరి డీసీసీ అధ్యక్షులు, ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్, బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో ఈ శిక్షణా శిబిరం నిర్వహించబడింది.



ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సచిన్ సావంత్, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ ఇంచార్జ్, మాజీ మంత్రివర్యులు బసవరాజు సారయ్య, హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ చామల మాట్లాడుతూ... పార్టీ బలోపేతానికి మరియు ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో బూత్ స్థాయి ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. నియోజకవర్గంలో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లడానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ సదస్సులో రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్మన్ శ్రీమతి బండ్రు శోభారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి నియోజకవర్గ పరిధిలోని వివిధ మున్సిపాలిటీల చైర్మన్లు, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు మరియు పెద్ద సంఖ్యలో బీఎల్ఏలు పాల్గొన్నారు.

## విద్యను ఉచితంగా పొందండి.. లేదంటే ఆర్థిక ఇబ్బందులు తప్పవు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, భద్రాద్రి కొత్తగూడెం:** ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం తేగడ పంచాయతీ పరిధిలో గల జంగాలపల్లి గ్రామంలో బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించే లక్ష్యంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జంగాలపల్లి ప్రధానోపాధ్యాయులు, తేగడ పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాళ్లు పాల్గొని గ్రామంలో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి పి.వి. రమణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యాబోధన జరుగుతోందని ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు, ఆధునిక బోధనా విధానాలు అందుబాటులో ఉన్నాయని విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, రుచికరమైన మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకం వంటి అనేక సౌకర్యాలు కల్పిస్తున్నామని. ఈ అవకాశాలను తల్లిదండ్రులు వినియోగించుకోవాలని లేని పక్షంలో తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో చేర్పిస్తే అసలే నిరుపేదలు ఆర్థికంగా దెబ్బతినే అవకాశం ఉందని కావున తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యతో పాటు ఆర్థిక భారాన్ని కూడా తగ్గించవచ్చు అని, గత విద్యా సంవత్సరంలో చర్ల మండలంలో పదో తరగతి ఫలితాలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయని, 96 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని, తేగడ పాఠశాల విద్యార్థులు మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి పాఠశాల ప్రతిష్టను పెంచారని, జంగాలపల్లి హ్యాబిటేషన్ తేగడ గ్రామపంచాయతీ పరిధిలోకి వస్తున్నందున స్థానిక విద్యార్థులను తేగడ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అదేవిధంగా చదువును మధ్యలో మానేసిన డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, పేద వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలే ఉత్తమ వేదికగా నిలుస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం విద్యా రంగంలో అనేక సంస్కరణలు అమలు చేస్తోందని, విద్యార్థుల కోసం కొత్త పథకాలు ప్రవేశపెడుతోందని ఇంటర్మీడియట్ వరకు మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థులకు అవసరమైన షూస్, కిట్లు తదితర సదుపాయాలు అందజేస్తూ ప్రభుత్వ పాఠశాలలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలనే ఎంపిక చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి పి.వి. రమణ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయ రాళ్ల విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మీ ఉద్యోగానికి ఎంపికైన ఆదే మహేష్‌కు ఘన సన్మానం

**తాటినగర్ గ్రామానికి గర్వకారణంగా నిలిచిన యువకుడు.**

**కృషి, పట్టుదలతో సాధించిన విజయం యువతకు స్ఫూర్తి**

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, జూన్ 11, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కొటాల మండలం తాటినగర్ గ్రామానికి చెందిన ఆదే మహేష్ ఆర్మీ ఉద్యోగానికి ఎంపిక కావడంతో గ్రామంలో ఆనందోత్సాహాలు వెల్లువెత్తాయి. గ్రామానికి చెందిన ఆదే భీమయ్య -- గనాబాయి దంపతుల కుమారుడైన మహేష్ సాధించిన ఈ విజయం కుటుంబానికే కాకుండా గ్రామానికే గర్వకారణంగా మారింది. దేశ రక్షణ రంగంలో ప్రతిష్ఠాత్మకమైన ఆర్మీ ఉద్యోగం సాధించిన మహేష్ గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చాడని గ్రామస్తులు పేర్కొన్నారు. కష్టపడి చదివి, పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకున్న అతని విజయం గ్రామ యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. మహేష్ ఎంపిక సందర్భంగా గ్రామపంచాయతీలో తాటినగర్ సర్పంచ్ కత్యార్ మౌనిక--అనిల్, ఉప సర్పంచ్ సాజన్, వార్డ్ మెంబర్ ఉమేష్, పంచాయతీ కార్యదర్శి తిరుపతమ్మ, గ్రామస్తులు కలిసి ఆదే మహేష్ కు శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కత్యార్ మౌనిక--అనిల్ మాట్లాడుతూ ఆదే మహేష్ సాధించిన విజయం తాటినగర్ గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు. కష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించడం ద్వారా మహేష్ గ్రామ యువతకు ఆదర్శంగా నిలిచాడని అన్నారు. ఉప సర్పంచ్ సాజన్ మాట్లాడుతూ గ్రామ యువతలో ప్రతిభకు కొదవలేదని, సరైన మార్గనిర్దేశం ఉంటే ప్రభుత్వ ఉద్యోగాలు సాధ్యం అవుతాయని పేర్కొన్నారు.



మహేష్ విజయం ఇతర యువతకు దిశానిర్దేశం చేస్తుందని అన్నారు.గ్రామం తరఫున యువతకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని తెలిపారు.తనకు లభించిన సన్మానానికి స్పందించిన ఆదే మహేష్ మాట్లాడుతూ తన విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల మార్గనిర్దేశం, గ్రామ ప్రజల ఆశీస్సులే ప్రధాన కారణమని తెలిపారు. దేశ సేవలో నిబద్ధతతో పనిచేస్తానని పేర్కొన్నారు.

## అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో చేర్చే బాధ్యత "బిఎల్ఏ"లదే..

**ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య...**

**యాదాద్రి భువనగిరి జిల్లా టీపీసీసీ**

**ఆధ్వర్యంలో బిఎల్ఏలకు ప్రత్యేక శిక్షణ....**

**పాల్గొన్న బీర్ల ఐలయ్య, చామల కిరణ్ కుమార్, సచిన్ సావంత్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఏ) ల కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు కావడం, అనర్హుల పేర్ల తొలగింపు, వివరాల సవరణ వంటి అంశాలపై బిఎల్ఏలకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య,




భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి మరియు తెలంగాణ ఇన్‌చార్జి సచిన్ సావంత్, మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా బిఎల్ఏలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేరు లేదా ఇతర వివరాల్లో ఉన్న తప్పులను సరిచేయించే ప్రక్రియలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. అలాగే, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను



కచ్చితంగా పాటిస్తూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని తెలిపారు. పార్టీ శ్రేణులు, బిఎల్ఏలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఓటు హక్కు వినియోగంపై ప్రతి కుటుంబానికి సమాచారం చేరవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు జిల్లా, మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, బిఎల్ఏలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శిక్షణ అనంతరం ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన సందేహాలను నాయకులు నివృత్తి చేసి, కార్యాచరణపై మార్గనిర్దేశం చేశారు.

# హైదరాబాద్‌లో భారీ చోరీ కేసు ఛేదించిన పోలీసులు.. నేపాలీల అరెస్ట్!


**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, శేరిలింగంపల్లి:** గచ్చిబౌలిలో హిల్ రిడ్జ్ విల్లాలో నేపాలి గేమ్‌కు భారీ దోపిడీని సైబరాబాద్ పోలీసులు ఛేదించారు. సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కమిషనర్ రమేష్ రెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఇంటి యజమానులు లేని సమయంలో విల్లాలో దోపిడీ చేసి పారిపోయిన నేపాలి గ్యాంగ్‌ను సైబరాబాద్ పోలీసులు చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేశారు. విల్లాలో వృద్ధ దంపతులు వ్యక్తిగత పనిమీద బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి ఆభరణాలు అదృశ్యమయ్యాయి. ఈ మేరకు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. దొంగతనం జరిగిన విషయాన్ని కుమారుడకి చెప్పగా ఇంటికి వచ్చి, తన వద్ద ఉన్న తాళం చెవితో లాకర్‌ను తెరిచారు. ఆ లాకర్ నుండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ సమాచారం అందిన వెంటనే, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ప్రత్యేక ఆపరేషన్స్, టీమ్ క్రైమ్ బృందాలు, స్థానిక పోలీసులను రంగంలోకి దించారు. నిందితుల కదలికలపై నిఘా పెట్టారు. ఉత్తరప్రదేశ్, బీహార్ ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు ఆరు పోలీస్ బృందాలను పంపారు. అనుమానితుల వివరాలు వారి ఛాయా చిత్రాలను ఆయా రాష్ట్రాల పోలీసు అధికారులకు అందజేశారు. వారి సహాయంతో నేపాలీ నేరస్తుల ముఠాలను పట్టుకోవడం కోసం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం




కూడా ఈ దర్యాప్తులో పూర్తి సహకారాన్ని అందించింది. గచ్చిబౌలి పోలీస్ ఇన్‌స్పెక్టర్ పి. నరేష్ బృందం రాంపూర్ జిల్లా ఎస్పీ సహకారంతో, ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్ జిల్లా, బిలాస్‌పూర్ రోడ్డువద్ద ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. దొంగిలించిన ఆస్తి అంతా యథాతథంగా స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో కమల్ షాహి(32), విమల షాహి, కల్పన షాహిలు ఉన్నారు.

**దోపిడీలకు పాల్పడేందుకు పని మనుషులుగా చేరి..**

నగరంలో దోపిడీలకు పాల్పడేందుకు ప్రత్యేక ముఠా ఉంది. ఈ ముఠా ధనికులు నివాసం ఉండే విలాసవంతమైన విల్లాలు గుర్తించి పని మనుషులుగా చేరుతారు. ఇంటి యజమానులు లేని సమయాన్ని ఆసరాగా చేసుకుని, తలుపులు, లాకర్లను పగలగొట్టి బంగారం, నగదు ఇతర విలువైన వస్తువులు దొంగిలిస్తారు. పరారీలో ఉన్న నిందితుడు నేపాలీ వాసి సురేష్ నేపాల్ నుండి వ్యక్తులను హైదరాబాద్‌కు రప్పించి, ఖరీదైన విల్లాలలో ఇళ్లలో





వ నివ ం న ం ష ం ల ం గా

నియమిస్తుంటాడు. తాను నియమించిన పని మనుషుల ద్వారా కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయాల గురించి సమాచారం సేకరించి, ఆ సమాచారం ఆధారంగా దొంగతనాలకు పాల్పడతాడు. కరణ్ బిశ్వ కర్మ సహాయంతో సురేష్ హిల్ రిడ్జ్ విల్లాస్'లోని విల్లా నంబర్ 73లో పని మనుషులను నియమించి, ఆ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డాడు. నిందితుల నుంచి 7.837 గ్రాముల బంగారం, 1361 గ్రాముల వెండి వస్తువులు రూ. 33 వేల నగదు, 2 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్థానిక కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలించారు. లాకర్ పక్కనే ఉన్న తాళం చెవిని గుర్తించి, దానితో లాకర్ తెరిచి, ఆభరణాల అన్నింటినీ తీసుకుని పారిపోయినట్లు నిందితులు అంగీకరించారు. హిల్ రిడ్జ్ విల్లాస్‌లో జరిగిన భారీ దొంగతనం కేసును వేగంగా ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసులు అధికారులకు సైబరాబాద్ కమిషనర్ రమేష్ రెడ్డి అభినందించారు.

## సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్-2026 అమలుకు

# కార్యాచరణ.. శాఖల సమన్వయం తప్పనిసరి

**అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, సంగారెడ్డి ప్రతినిధి:** జిల్లాలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నియమాలు-2026ను సమర్థవంతంగా అమలు చేసి పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన వాతావరణం కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి, జడ్పీ సీఈవో, డివిజనల్ పంచాయతీ అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలు, వైద్య ఆరోగ్య, పశుసంవర్ధక, డీఆర్‌డీఓ తదితర శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఘన వ్యర్థాల నిర్వహణను శాస్త్రీయ పద్ధతిలో చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామాలు, పట్టణాల్లో తడి, పొడి వ్యర్థాలను వేరు చేసి సేకరించే విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, ఇంటింటి చెత్త సేకరణ, రవాణా, ప్రాసెసింగ్ ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త పారవేయడం, చెత్తను కాల్చివేయడాన్ని పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో చెత్త పేరుకుపోయే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణతో సమస్యను పరిష్కరించాలన్నారు. అపార్ట్‌మెంట్లు, పరిశ్రమలు, వాణిజ్య సముదాయాలు, విద్యాసంస్థలు, ఫంక్షన్ హాళ్లను బల్క్ వేస్ట్ జనరేటర్లుగా గుర్తించి, నిబంధనల ప్రకారం వారే వ్యర్థాల నిర్వహణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నియమాలను కట్టుదిట్టంగా అమలు చేస్తూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించాలని, రోడ్లపై చెత్త లేకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. కొత్త మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డులు, ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటుకు భూసేకరణ, మౌలిక వసతులపై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నియమాలపై ప్రజల్లో అవగాహన పెంచి, పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం పెంపొందించాలన్నారు. సమావేశంలో మున్సిపాలిటీల ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, ఆస్తి పన్ను వసూళ్లపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం



ప్లాస్టిక్ వినియోగం తగ్గించే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన బట్ట సంచులను కలెక్టర్ ప్రతీక్ జైన్, అడిషనల్ కలెక్టర్ పాండు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, జడ్పీ సీఈవో జానకి రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మల్లారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలు, పశుసంవర్ధక, వైద్య ఆరోగ్య, డీఆర్‌డీఓ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పీఓకేలో మళ్లీ పాక్ పోలీసుల కాల్పులు.. 16 మంది మృతి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11 :** పాక్ ఆక్రమిత కశ్మీర్ లో గత కొన్ని రోజులుగా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. నిరసనకారులపై ఇటీవల జరిగిన కాల్పుల ఘటన మరువకముందే, తాజాగా భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో మరో 16 మంది ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక నివేదికలు చెబుతున్నాయి. ఈ తాజా మరణాలతో ఈ ప్రాంతంలో గత వారం రోజులుగా జరిగిన ఘర్షణల్లో మరణించిన వారి సంఖ్య 30 దాటినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పీఓకే పరిధిలోని ప్రధాన నగరాల్లో కర్ఫ్యూ విధించడంతో పాటు మొబైల్, ఇంటర్నెట్ సేవలను పూర్తిగా నిలిపివేశారు.

**ఆందోళనలకు ప్రధాన కారణాలు ఇవే**

జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ నేతృత్వంలో ఈ నిరసనలు ఉధృతంగా సాగుతున్నాయి. పీఓకేలో విపరీతంగా పెరిగిపోయిన నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ బిల్లులపై సబ్సిడీలు ఇవ్వాలని ప్రజలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. దీనికి తోడు జూలైలో జరగబోయే ప్రాంతీయ ఎన్నికల్లో శరణార్థుల కోసం 12 స్థానాలను రిజర్వ్ చేయాలనే పాక్ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక ట్రేడర్స్, సివిల్ సొసైటీ గ్రూపులు తిరుగుబావుటా ఎగురవేశాయి.

**ఉగ్రవాద నిరోధక చట్టం కింద నిషేధం**

పరిస్థితి చేదాటిపోతుండటంతో పాక్ అనుకూల స్థానిక ప్రభుత్వం జాయింట్ అవామీ యాక్షన్ కమిటీని ఉగ్రవాద నిరోధక చట్టం కింద నిషేధిత సంస్థగా ప్రకటించింది. అంతేకాకుండా ఆందోళనలను అణచివేయడానికి పాకిస్తాన్ కేంద్ర ప్రభుత్వం భారీగా పారామిలిటరీ బలగాలను పీఓకేకు తరలించింది. రావలకోట్, ముజఫరాబాద్ వంటి నగరాల్లో నిరసనకారుల ర్యాలీలపై భద్రతా బలగాలు



లైవ్ రౌండ్ల కాల్పులు, లాఠీఛార్జ్ మరియు టియర్ గ్యాస్ ప్రయోగించడంతో రణరంగంగా మారింది. ఈ పరిణామాలపై బ్రిటన్ పార్లమెంట్ సభ్యులతో పాటు అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## వెనుకబడిన కుటుంబాలకు కుమార్తెల వివాహాలకు కళ్యాణ లక్ష్మి ఆర్థిక భరోసా....

**ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కళ్యాణ లక్ష్మి కొండంత భరోసా....**

**కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆలేరు నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మి పథకం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,



ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య యాదగిరిగుట్ట లోని తన కార్యాలయం వద్ద లబ్ధిదారులకు స్వయంగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అమలు చేస్తున్న పథకాలలో కళ్యాణ లక్ష్మి ఒక ముఖ్యమైన పథకమని తెలిపారు. ఈ పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కుమార్తెల వివాహ సమయంలో ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తూ భరోసా కల్పిస్తున్నదని చెప్పారు. ఆలేరు నియోజకవర్గంలో అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలు సమన్వయంతో కొనసాగుతున్నాయని, ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, మహిళా లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




## మీనాక్షి నటరాజన్‌కు బిగ్ షాక్.. ముగ్గురు బీజేపీ అభ్యర్థులు ఏకగ్రీవం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, సెంట్రల్ బ్యూరో :** తెలంగాణ పీసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కు గట్టి షాక్ తగిలింది. మధ్యప్రదేశ్‌లో ముగ్గురు బీజేపీ రాజ్యసభ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తరుణ్ చుగ్, రజనీష్ అగర్వాల్, మహేష్ కేవట్ పేర్లను ఎన్నికల అధికారి అధికారికంగా ప్రకటించారు. అయితే, తన నామినేషన్ తిరస్కరణను సవాల్ చేస్తూ మీనాక్షి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ సందర్భంగా మీనాక్షి నటరాజన్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. నటరాజన్ నామినేషన్‌ను అన్యాయంగా తిరస్కరించినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల ప్రక్రియపై మధ్యంతర స్టే విధించాలని కోరారు. అయితే, కోర్టు అందుకు నిరాకరించింది. నటరాజన్ పిటిషన్‌పై జూన్ 12న విచారణకు స్వీకరించేందుకు అంగీకరించింది. అయితే, ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోబోమని కోర్టు స్పష్టం చేసింది. కోర్టు తీర్పు తర్వాత ముగ్గురు బీజేపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈసీ ప్రకటించింది. ఈ ప్రకటనతో హస్తం పార్టీకి గట్టి షాక్ తగిలినట్లైంది.

**అసలేం జరిగిందంటే..?**

మధ్యప్రదేశ్?లోని మూడు రాజ్య సభ స్థానాలకు ఈ నెల 18న ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుతం ఆ రాష్ట్ర అసెంబ్లీలోని బలాబలాల ప్రకారం రెండు స్థానాలను అధికార బీజేపీ సునాయాసంగా కైవసం చేసుకోనుండగా.. ఒక స్థానం కాంగ్రెస్ కు దక్కే అవకాశం ఉంది. ఈ మూడో సీటు కోసం తెలంగాణ పీసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజ్ కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అయితే, హైదరాబాద్?లో నమోదైన క్రిమినల్ కేసు వివరాలు, ఆస్తులు, బ్యాంక్ లావాదేవీల వివరాలను ఆమె తన నామినేషన్ పత్రాల్లో దాచిపెట్టారని బీజేపీ అభ్యర్థి మహేశ్ కేవత్ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. దానిని పరిశీలించిన రిటర్నింగ్ ఆఫీసర్ మీనాక్షి నటరాజన్ నామినేషన్?ను తిరస్కరించారు. బీజేపీ అభ్యర్థి మహేశ్ కేవట్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా అధికారులు ప్రకటించారు. దీంతో దేశ వ్యాప్తంగా వివాదం చెలరేగింది. బీజేపీ ఇప్పటి వరకు ఓట్ చోరీకే పాల్పడింది.. ఇప్పుడు సీట్ చోరీకి కూడా పాల్పడుతున్నదని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు. ఇదే విషయమై కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి నామినేషన్ తిరస్కరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. దీనిపై నేడు దేశ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది.

## పాడి రైతుల ఉద్యమాన్ని అక్రమ అరెస్టులతో ఆపలేరు....

**పాడి రైతులు కాకల్ల నవీన్, పారుపల్లి సంజీవరెడ్డి**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం పాముకుంట గ్రామనికి చెందిన పాడి రైతులు కాకల్ల నవీన్, పారుపల్లి సంజీవరెడ్డి లు విలేకరులతో మాట్లాడారు... ఆలేరు ఎమ్మెల్యే మా పాడి రైతుల ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు. ?ఆరుగాలం చెమటోడ్చి, రాత్రింబవళ్లు కష్టపడి మేము మదర్ డైరీకి పాలు పోస్తే నెలలు గడుస్తున్నా మా పాల బిల్లులు చెల్లించకుండా కాలయాపన చేయడం ఎంతవరకు న్యాయం? మా కష్టార్జితాన్ని అడగడమే మేం చేసిన నేరమా రూ,10 కోట్లు ఎవరికి చెల్లించారు? మొన్నటికి మొన్న పాడి రైతులకు రూ. 10 కోట్ల బిల్లులు విడుదల చేశామని ప్రగల్భాలు పలికిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆ డబ్బు ఎవరి ఖాతాల్లో వేశారో సమాధానం చెప్పాలనీ డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో పాడి రైతులకు పైసా అందలేదు. రైతుల కష్టాన్ని మీ రాజకీయ ప్రచారానికి వాడుకోవడం సిగ్గుచేటు ?అధికార బలంతో మా పాడి రైతులను అక్రమ అరెస్టులు చేసి అణచివేస్తారా? మాకు రావలసిన 8 బిల్లుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని శాంతియుతంగా గురువారం రోజున నిరసన తెలపడానికి పిలుపునిస్తే అధికారం చేతిలో ఉందని మమ్ములను అక్రమంగా అరెస్టులు చేయిస్తారా అని అన్నారు. గుర్తుపెట్టుకోండి "ఎద్దేడ్చిన వ్యవసాయం, రైతేడ్చిన రాజ్యం" బాగుపడినట్లు చరిత్రలోనే లేదు. మా పాడి రైతుల బిల్లులు మాకు చెల్లించే వరకు ?ఉద్యమం ఆగేది లేదు అణచివేత ఎక్కువైతే తిరుగుబాటు కూడా అంతే ఉధృతంగా ఉంటుంది. ఎంత మందిని అరెస్ట్ చేసినా, ఎంత ఒత్తిడి తెచ్చినా మా హక్కుల కోసం చేసే పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదు. మా పాడి రైతుల కడుపు కొట్టి, వాళ్ల ఉసురు పోసుకుంటే మదర్ డైరీ యాజమాన్యానికి, ఈ ప్రభుత్వానికి ఖచ్చితంగా ఆ పాపం తగులుతుందనీ అన్నారు. మా డిమాండ్ ఒక్కటే మా పాడి రైతులకు రావాల్సిన 8 నెలల పాల బిల్లుల బకాయిలను తక్షణమే, ఒకే విడతలో పూర్తిగా చెల్లించాలనీ డిమాండ్ చేసారు. లేని పక్షంలో పాడి రైతుల ఉద్యమం ఉధృతం చేస్తామని అన్నారు.

# భువనగిరిలో బస్ డిపో ఏర్పాటుకు ఆర్టీసీ ఎండీకి చైర్‌పర్సన్ వినతి

**భువనగిరిలో బస్ డిపో లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు....**
**ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి సూచనలతో వినతి....**
**సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి...**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సూచనల మేరకు భువనగిరి పట్టణంలో బస్ డిపో ఏర్పాటు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తంగెళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిని కోరారు. గురువారం భువనగిరి బస్టాండ్‌ను సందర్శించిన ఎండీ నాగిరెడ్డిని చైర్‌పర్సన్ శ్రీవాణి రవికుమార్ కలిసి పట్టణ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. భువనగిరి బస్టాండ్‌లో అన్ని బస్సులు హాల్ట్ అయ్యే విధంగా చూడాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి సలహాతో జిల్లా కేంద్రమైన భువనగిరిలో బస్ డిపో అవసరాన్ని ఎండీ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. డిపో లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వినతులపై సానుకూలంగా స్పందించి ఎండీ నాగిరెడ్డి మాట్లాడుతూ... ఎమ్మెల్యే సూచించిన విధంగా బస్ డిపో ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగాళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ తంగంపల్లి రవికుమార్, వైస్ చైర్మన్ పోతం శెట్టి మంజుల వెంకటేష్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ అవైస్ చిస్తీ, పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు నరసింహ, పట్టణ అధ్యక్షుడు కూర వెంకటేష్, ముఖ్య కాంగ్రెస్ నాయకులు, బెండ లాల్ రాజ్, పిట్టలా బాల రాజ్, బబ్లు, మజర్ షఫీక్ అహ్మద్, కూర శివ కుమార్, మహమ్మద్ రఫీద్దీన్ గౌరీ, గుమిడెల్లి రమేష్, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మట్టి పరీక్ష నిర్వహించిన మల్లారెడ్డి విద్యార్థులు..



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11,సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా కాసింపూర్ గ్రామంలో మల్లారెడ్డి విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్, మైసమ్మగూడ ఆధ్వర్యంలో రైతుల పొలాల్లో మట్టి పరీక్ష కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈసందర్బంగా వారు మాట్లాడుతూ ఈ మట్టి పరీక్ష రైతుల పొలాల నుండి మట్టి నమూనాలను సేకరించి, వాటి భౌతిక మరియు రసాయన లక్షణాలను విశ్లేషించడం జరిగిందని,మట్టి పరీక్షల ద్వారా నేలలోని పోషక పదార్థాల స్థితిని తెలుసుకొని, పంటలకు అవసరమైన ఎరువుల వినియోగంపై రైతులకు శాస్త్రీయ సూచనలు అందించబడినాయన్నారు.రైతులు తమ పొలాల ఉత్పాదకతను పెంచుకోవడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని అన్నారు.ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ విద్యార్థులు సాయి ఆదిత్య, హరీష్, శ్రీనాథ్, కార్తీక్ మరియు చంద్రశేఖర్ చురుకుగా పాల్గొని మట్టి నమూనాల సేకరణ, పరీక్షలు మరియు రైతులకు అవగాహన కల్పించడంలో సహకరించారు.

# మంత్రి అడ్లూరిని కలిసిన ఇంజ మహేష్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం, కాల్వపల్లి గ్రామానికి చెందిన ఇంజ మహేష్ మాదిగ, మాదిగ ఉద్యోగుల సమైక్య యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు, హైదరాబాద్ మినిస్టర్ బంగ్లాలో సాంఘిక సంక్షేమ శాఖ, షెడ్యూల్ కులాల అభివృద్ధి, మైనార్టీ సంక్షేమం, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి శ్రీ యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు ఎన్ఎస్యుఐ మండల అధ్యక్షులు గంధమల్ల నవీన్ కుమార్, దేశ పాండే భరత్, చింతిగారి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# అప్పటికల్లా విశ్వగురుగా భారత్...
# చైనాను వెనక్కి నెట్టి అమెరికాతో పోటీ పడుతూ... నంబర్ 1 స్థానానికి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, సెంట్రల్ బ్యూరో :**
ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పెను మార్పులు రాబోతున్నాయి. ప్యారిస్కు చెందిన వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ తాజా నివేదిక ప్రకారం 2060 నాటికి గ్లోబల్ జీడీపీ వాటాలో చైనాను భారత్ అధిగమిస్తుంది. చైనా జనాభా వేగంగా పడిపోతుండటం వల్ల వారి వాటా తీవ్రంగా తగ్గుముఖం పడుతుందని, అదే సమయంలో భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతుందని నిపుణులు అంచనా వేశారు.భారత్ త్వరలో ప్రపంచ ఆర్థిక శక్తిగా అవతరించనుంది. ప్యారిస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ కు చెందిన వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ ఇటీవల విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం, గ్లోబల్ జస్టిస్ రిపోర్ట్ ఏ ప్లాన్ ఫర్ ఈక్వాలిటీ అండ్ ప్రాస్పెరిటీ విత్ ప్లానెటరీ బౌండరీస్ అనే పేరుతో ఒక అధ్యయనం వెలువడింది. ఈ నివేదిక ప్రకారం 2060 నాటికి కొనుగోలు శక్తి ఆధారంగా గ్లోబల్ జీడీపీ వాటాలో చైనాను భారత్ అధిగమిస్తుందని పరిశోధకులు అంచనా వేశారు.21వ శతాబ్దం ద్వితీయార్థంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బీజింగ్ వాటా క్రమంగా క్షీణిస్తుందని వారు తమ నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ మార్పులు భవిష్యత్తులో ప్రపంచ దేశాల ముఖచిత్రాన్ని మార్చే విధంగా ఉండబోతున్నాయని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.

**చైనా జనాభా, ఆర్థిక పరిస్థితి:**
ప్రస్తుతం ప్రపంచ జీడీపీలో చైనా వాటా కొనుగోలు శక్తి పరంగా దాదాపు 20 శాతంగా ఉంది. ఇది



అమెరికా కంటే మూడింట ఒక వంతు. 2035 నాటికి చైనా ఆర్థిక వ్యవస్థ అమెరికా కంటే 2 రెట్లు పెద్దగా ఉంటుందని అంచనాలు ఉన్నాయి. కానీ చైనా జనాభా వాటా చాలా వేగంగా పడిపోతోంది. 1945లో ప్రపంచ జనాభాలో 23 శాతంగా ఉన్న చైనా జనాభా 2025 నాటికి 17 శాతానికి పడిపోతుంది. అలాగే 2100 నాటికి అది 8 శాతం కంటే తక్కువకు చేరుకుంటుంది. దీని ఫలితంగా 21వ శతాబ్దం ద్వితీయార్థంలో ప్రపంచ జీడీపీలో చైనా వాటా స్థిరపడి క్రమంగా క్షీణించడం ప్రారంభమవుతుంది. ఈ పరిణామాల కారణంగా సరిగ్గా 2060 నాటికి చైనాను భారతదేశం అధిగమిస్తుందని నివేదిక తెలియజేసింది.

**ప్రపంచ అసమానతలు:**
గతంలో కొన్ని దేశాలు ప్రపంచాన్ని శాసించాయి. 1950 ప్రాంతంలో అమెరికా ప్రపంచ జీడీపీలో 35 నుంచి 40 శాతం వాటాతో, అలాగే 1900–1910 మధ్య కాలంలో ఐరోపా 40 నుంచి 45 శాతం వాటాతో పూర్తి ఆధిపత్యం చెలాయించాయి. కానీ చైనాకు భవిష్యత్తులో అలాంటి ఆధిపత్య స్థితి వచ్చే అవకాశం చాలా తక్కువ అని పరిశోధకులు స్పష్టం చేశారు. 19, 20వ శతాబ్దాల మాదిరిగా కాకుండా 21వ శతాబ్దంలో ప్రపంచం బహుళ ధృవంగా మారుతుందని నివేదిక వెల్లడించింది.మరోవైపు చైనాతో పోలిస్తే భారత్‌లో అసమానతలు చాలా ఎక్కువగా ఉన్నాయని, కానీ ఉత్పాదకత వృద్ధి మాత్రం తక్కువగా ఉందని నివేదిక పేర్కొంది. చైనాలో మానవ వనరుల కోసం ఖర్చు చేయడం వల్లే అక్కడ ఉత్పాదకత మెరుగ్గా ఉందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

**తాజా జీడీపీ అంచనాలు:**
కొనుగోలు శక్తి అనేది ఒక దేశం కరెన్సీకి మరో దేశంలో ఎంత మేర వస్తువులు, సేవలు కొనుగోలు చేయవచ్చో కొలిచే ప్రమాణం. అంతర్జాతీయ ద్రవ్య నిధి విడుదల చేసిన తాజా వరల్డ్ ఎకనామిక్ ఔట్లుక్ ప్రకారం 2026 నాటికి భారత్ స్థూల దేశీయోత్పత్తి విలువ 4.15 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. ఇది 2025 లో ఉన్న 3.92 ట్రిలియన్ డాలర్ల కంటే ఎక్కువ.అదే సమయంలో బ్రిటన్ జీడీపీ 2025లో 4 ట్రిలియన్ డాలర్ల నుంచి 2026లో 4.27 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుంది. అయితే జపాన్ జీడీపీ మాత్రం 2025లో ఉన్న 4.48 ట్రిలియన్ డాలర్ల నుంచి 2026 నాటికి 4.38 ట్రిలియన్ డాలర్లకు పడిపోతుందని అంచనా. ఇక 2026లో అమెరికా జీడీపీ అత్యధికంగా 32.38 ట్రిలియన్ డాలర్లుగా ఉండగా, 2వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనా జీడీపీ 20.85 ట్రిలియన్ డాలర్లుగా నమోదు కానుందని నివేదిక వివరించింది.

# యుద్ధం కావాలా..? భారత్ కు పాకిస్థాన్ సంచలన వార్నింగ్..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, సెంట్రల్ బ్యూరో :**
భారత్ కు సరిహద్దు దేశమైన పాకిస్థాన్ తో ఎప్పుడూ ప్రమాదం పొంచి ఉంటూనే ఉంది. దశాబ్దాలుగా భారత్ పై పాకిస్థాన్ దాడులు, కుట్రలు చేస్తూనే ఉంది. గతేడాది ఏప్రిల్ 22న జమ్మూకాశ్మీర్ లో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది టూరిస్టులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దాడి వెనక ఉన్నది పాకిస్థాన్ అని తేలిన నేపథ్యంలో ఆ దేశంపై భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. మే 7 నుంచి 10 మధ్య జరిగిన ఈ ఆపరేషన్ సింధూర్ లో భాగంగా పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లో 9 కీలక ఉగ్రవాద స్థావరాలను భారత సైన్యం ధ్వంసం చేసింది. వందలాది మంది ఉగ్రవాదులను హతమార్చింది. దాంతోపాటు దౌత్య పరంగా, ఆర్థిక పరంగా అత్యంత కఠినమైన వ్యూహాత్మక నిర్ణయాలను తీసుకుంది.అందులో కీలకమైనది.. 1960 నాటి సింధూ నది జలాల ఒప్పందాన్ని



తాత్కాలికంగా నిలిపివేయడం ఒకటి. రక్తం, నీరు కలిసి ప్రవహించలేవు అని భారత్ ఆ సందర్భంలో స్పష్టం చేసింది. అయితే తాజాగా ఇదే వివాదంపై కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ షాకింగ్ కామెంట్స్ చేసిన విషయం తెలిసిందే. రాబోయే రోజుల్లో పాకిస్థాన్ కు సింధూ నది వ్యవస్థ నుంచి ఒక్క చుక్క నీరు కూడా వెళ్లకుండా చేస్తామని పేర్కొన్నారు. అయితే ఇదే వ్యవహారంపై తాజాగా పాకిస్థాన్ భారత్ కు మరోసారి వార్నింగ్ ఇచ్చింది. తమకు రావాల్సిన నీటిని భారత్ అడ్డుకోవాలని చూస్తే అది దక్షిణాసియాలో శాంతికి తీవ్ర ముప్పుగా మారుతుందని హెచ్చరించింది. ఈ మేరకు భారత్ పై పాకిస్థాన్ విదేశాంగ ప్రతినిధి తాహిర్ అంద్రాబీ భారత్ కు హెచ్చరికలు జారీ చేశారు.లక్షల మందికి జీవనాధారమైన సింధూ నదీ జలాలను భారత్ నిలిపివేయాలని చూడటం తీవ్ర బాధ్యతారహితమైన చర్య.. ఈ నిర్ణయం వల్ల అంతర్జాతీయ శాంతి భద్రతలకు వాటిల్లే ముప్పునకు భారత్ దే బాధ్యత అని పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి చార్టర్ లోని ఆర్టికల్ 51 ప్రకారం.. పాకిస్థాన్ జీవనానికి అత్యంత అవసరమైన నీటిని ఉద్దేశపూర్వకంగా నిలిపివేస్తే దానిని యుద్ధ చర్యగానే పరిగణిస్తామని ఆయన హెచ్చరించారు. జలవనరులపై పాకిస్థాన్ కు ఉన్న హక్కులు చర్చలకు అతీతమైనవని.. అంతర్జాతీయ చట్టాల ప్రకారం దౌత్య, న్యాయ, ఆర్థిక, రాజకీయ పరంగా తమ హక్కులను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యల్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

# సోషల్ మీడియా బ్యాన్! పార్లమెంట్ లో 'డిజిటల్ సేఫ్టీ యాక్ట్' బిల్లు.!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, సెంట్రల్ బ్యూరో:**
ఆన్‌లైన్ మాయాజాలం, సోషల్ మీడియా వ్యసనం నుంచి చిన్నారులను కాపాడేందుకు ప్రపంచవ్యాప్తంగా సరికొత్త విప్లవం మొదలైంది. చేతిలో స్మార్ట్‌ఫోన్, కళ్లలో అంతులేని స్క్రోలింగ్ ప్రపంచంతో లోకాన్ని మరిచిపోతున్న బాల్యాన్ని రక్షించుకోవడానికి డిజిటల్ సరిహద్దులు సిద్ధమవుతున్నాయి. అల్గారిథమిక్ రికమెండేషన్ల ఉచ్చులో పడి ఆందోళన, ఒంటరితనం, డిప్రెషన్ వంటి తీవ్రమైన మానసిక ఆరోగ్య సమస్యల బారిన పడుతున్న నేటి తరాన్ని వాస్తవ ప్రపంచంలోకి మళ్లించేందుకు కఠినమైన చట్టాల అవసరం ప్రపంచ దేశాలకు ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది.ఈ నేపథ్యంలోనే, 16 ఏళ్ల లోపు వయసున్న పిల్లలు సోషల్ మీడియాను ఉపయోగించకుండా నిషేధం విధిస్తూ కెనడా ప్రభుత్వం ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన కొత్త డిజిటల్ భద్రతా బిల్లును (డిజిటల్ సేఫ్టీ యాక్ట్) ఆ దేశ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. ఆన్‌లైన్ ద్వారా కలిగే హానికరమైన ప్రభావాలు అత్యంత తీవ్రంగా ఉన్నాయని, పిల్లల భద్రతను ఏమాత్రం విస్మరించకూడదని కెనడియన్ ఐడెంటిటీ అండ్ కల్చర్ మంత్రి మార్క్ మిల్లర్ స్పష్టం చేశారు. అయితే, నిర్దేశిత భద్రతా ప్రమాణాలను పాటించే ప్లాట్‌ఫామ్‌లకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఉంటుంది.

**నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానా:**
నిబంధనలను ఉల్లంఘించి పిల్లలకు యాక్సెస్ ఇచ్చే కంపెనీలపై కెనడా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుంది. ఆయా సంస్థల ప్రపంచవ్యాప్త ఆదాయంలో 3 శాతం లేదా గరిష్టంగా సివి10 మిలియన్ల (దాదాపు 7.2 మిలియన్ డాలర్లు) భారీ జరిమానా విధిస్తారు. అలాగే, అనుమతి లేకుండా షేర్ చేసే అశ్లీల చిత్రాలను రిపోర్ట్ చేసిన 24 గంటల్లోగా ఆయా ప్లాట్‌ఫామ్‌ల నుంచి తొలగించాలని ఈ బిల్లు స్పష్టం చేసింది.

**ప్రత్యేక డిజిటల్ రెగ్యులేటరీ సంస్థ**
ఎఐ చాట్‌బాట్‌లను పర్యవేక్షించడానికి, వాటికి భద్రతా ప్రమాణాలను రూపొందించడానికి ఒక ప్రత్యేక డిజిటల్ రెగ్యులేటరీ సంస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఓపెన్‌ఎఐ సంస్థపై దేశంలో నమోదైన న్యాయపరమైన వ్యాజ్యాల నేపథ్యంలో ఈ ప్రతిపాదన రావడం గమనార్హం. పిల్లలను సోషల్ మీడియా మాయాజాలం నుంచి కాపాడి, వారు వాస్తవ ప్రపంచంలో మెరుగైన నైపుణ్యాలను అలవర్చుకునేలా ప్రోత్సహించడానికి ఈ చట్టం తోడ్పడుతుందని అధికారులు భావిస్తున్నారు. అయితే, ఈ బిల్లు పూర్తిగా ఆమోదం పొంది, అమలులోకి రావడానికి దాదాపు రెండేళ్లపైనే సమయం పట్టవచ్చని అంచనా.

**ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న నిషేధాల జోరు**
సోషల్ మీడియా నియంత్రణపై ప్రపంచవ్యాప్తంగా చర్చ రోజురోజుకూ బలపడుతోంది. ఇప్పటికే ఆస్ట్రేలియా, మలేషియా వంటి దేశాలు 16 ఏళ్ల లోపు పిల్లలపై పూర్తి స్థాయి నిషేధాన్ని విధించగా.. బ్రెజిల్, ఇండోనేషియా వంటి దేశాలు పాక్షిక ఆంక్షలను అమలు చేస్తున్నాయి. మరోవైపు ఫ్రాన్స్, డెన్మార్క్, పోలాండ్ దేశాలు సైతం కఠినమైన




నిబంధనలను పరిశీలిస్తున్నాయి. గ్రీస్ దేశం సైతం అడుగు ముందుకు వేసి, 15 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియాపై నిషేధాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించింది.

**భారత్‌లోనూ నిషేధం అత్యావశ్యం!**
ప్రపంచ దేశాల బాటలోనే భారతదేశంలో కూడా పిల్లలపై సోషల్ మీడియా నిషేధాన్ని పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భారత్‌లో చౌకైన ఇంటర్నెట్ లభ్యత కారణంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా కోట్ల మంది బాలలు స్మార్ట్‌ఫోన్‌లకు బానిసలవుతున్నారు. ఇది వారి చదువును దెబ్బతీయడమే కాకుండా సైబర్ బుల్లీయింగ్, ఆన్‌లైన్ వేధింపులు, రీల్స్ పిచ్చితో ప్రాణాల మీదకు తెచ్చుకునే ప్రమాదకర పరిణామాలకి దారితీస్తోంది. భారతీయ సంస్కృతి, కుటుంబ వ్యవస్థలను కాపాడుకుంటూ, భావి భారత పౌరులను మానసిక ఒత్తిడి నుంచి దూరం చేసి వారి శారీరక, మేధో వికాసానికి బాటలు వేయాలంటే మన దేశంలోనూ కఠినమైన 'డిజిటల్ సేఫ్టీ' చట్టాలు రావడం తక్షణ అవసరం.

## రాజపేటలో ఏకాదశి పర్వదినం సందర్భంగా నగర సంకీర్తన.....

### పాల్గొన్న జై శ్రీమన్నారాయణ బృందం......





**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలో గురువారం ఏకాదశి పర్వదినం సందర్భంగా నగర సంకీర్తన జరిగింది. మర్కుకుక్ శ్రీ భావానంద స్వామి వారి ఆశీస్సులతో అదరాశిపల్లి శ్రీధర్ శర్మ పర్యవేక్షణలో రాజపేట శాఖ అధ్యక్షులు నంగునూరు రాజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ రామకృష్ణ సాయి మందిరం నుండి ప్రధాన వీధుల గుండా గ్రామంలోని పలు ఆలయాలను దర్శించుకుంటూ నగర సంకీర్తన సాగింది. హరే రామ హరే కృష్ణ నామ జపంతో స్వార్ధ త్రి శత కోటి కార్యక్రమంలో భాగంగా నగర సంకీర్తన సాగింది. అనంతరం ఆలయంలో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు జరిగాయి. సామూహిక శ్రీ బావా నందష్టకం చేశారు. నంగునూరు జగదాంబ, పెంట రజిత, నాళ్ల పద్మ, బిర్రు లక్ష్మి, చామకూర అరుణ, బిర్రు శ్రీనివాసులు, నాళ్ళ శేఖర్, కకూనూరు బిక్షపతి, ఉప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కొమరవెల్లి స్వామి వారి సన్నిదిలో మదర్ డైరీ డైరెక్టర్.......

### ప్రత్యేక పూజలు చేసిన సందిల భాస్కర్ గౌడ్ వాణి దంపతులు......



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట గ్రామానికి చెందిన మదర్ డైరీ డైరెక్టర్ సందిల భాస్కర్ గౌడ్ వాణి పుణ్య దంపతులు గురువారం కొమరవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి దర్శనం చేసుకున్నారు. పెళ్లిరోజు సందర్భంగా కుటంబ సభ్యులు దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పెళ్లిరోజు సందర్భంగా మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, ఇతర నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు, మదర్ డైరీ డైరెక్టర్ లు శుభాకాంక్షలు చెప్పారు.

## సాకర్ సంగ్రామం.. అద్భుత ఆరంభం..

### అట్టహాసంగా ఫిఫా ప్రపంచకప్ ప్రారంభోత్సవం



మెక్సికో సిటీ : క్రీడా ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూసిన సమయం రానే వచ్చింది. ప్రతిష్టాత్మక ఫిఫా వరల్డ్ కప్ అట్టహాసంగా మొదలైంది. ఆతిథ్య మెక్సికో సిటీలోని ఎస్టాడియో అజ్టెకా స్టేడియం వేదికగా గురువారం రాత్రి జరిగిన ఆరంభ వేడుకలు జిగేల్‌మన్నాయి. స్టేడియం మధ్యలో ఉంచిన భారీ ప్రపంచకప్ ట్రోఫీ ప్రతిరూపం చుట్టూ మెక్సికో సాంప్రదాయ, ఆధునిక నృత్యకారులు చేసిన ప్రదర్శనతో వేడుకలు మొదలయ్యాయి. ఈ ఈవెంట్‌కే ప్రధాన ఆకర్షణగా నిలిచిన గ్లోబల్ పాప్ సెన్సేషన్ షకీరా మైదానంలోకి అడుగుపెట్టగానే అభిమానుల కేరింతలతో అజ్టెకా స్టేడియం దద్దరిల్లింది. ప్రముఖ సింగర్ బర్నా బాయ్ జతకలిసిన షకీరా స్టేడియాన్ని డ్యాన్స్ ఫ్లోర్‌గా మార్చేసింది. ఈ టోర్నీ అధికారిక సాంగ్ 'దాయ్ దాయ్' పాటకు తన ప్రదర్శనతో షకీరా స్టేడియాన్ని ఊపేసింది. అనంతరం మెక్సికో, దక్షిణాఫ్రికా తొలి పోరుకు సిద్ధమయ్యాయి.

హైదరాబాద్ పల్స్

# తెలంగాణ ఫ్యూచర్‌సిటీలో మరో 37 గ్రామాలు విలీనం.. ఆ విజ్ఞప్తులతో రేవంత్ నిర్ణయం!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 11, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'ఫోర్త్ సిటీ' లేదా 'భారత్ ఫ్యూచర్ సిటీ' నిర్మాణ పనుల్లో మరో కీలక ముందడుగు పడింది. రంగారెడ్డి జిల్లా పరిధిలో రూపుదిద్దుకుంటున్న ఈ మెగా ప్రాజెక్టు పరిధిని మరింతగా విస్తరిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు.

**ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి కొత్తగా గ్రామాల విలీనం**

స్థానిక రైతులు, ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి కొత్తగా మరో 37 గ్రామాలను విలీనం చేయడానికి సీఎం ఆమోదం తెలిపారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తూ ఆయన ఫైలుపై సంతకం చేశారు.

**సీఎం సభలో గ్రామస్తుల అభ్యర్ధన**

రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో దాదాపు రూ.20 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఎఫ్‌సీడీఏ భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తున్న సమయంలో.. తమ గ్రామాలను కూడా ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులో చేర్చాలంటూ స్థానిక ప్రజలు ప్లకార్డులతో అభ్యర్థించారు.

**కందుకూరు, మహేశ్వరం మండలాల్లో 37 గ్రామాలు ఫ్యూచర్ సిటీలో విలీనం**

దీనిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెంటనే స్పందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సంకల్పానికి గౌరవమిస్తూ రేవంత్ రెడ్డి అక్కడికక్కడే సానుకూల నిర్ణయం ప్రకటించారు. కొత్తగా విలీనమయ్యే ఈ 37 గ్రామాలలో మహేశ్వరం మండలానికి చెందిన 28 గ్రామాలు, కందుకూరు మండలానికి చెందిన 9 గ్రామాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఎఫ్‌సీడీఏ పోర్టల్‌ను కూడా ప్రారంభించిన ముఖ్యమంత్రి, ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

**హైదరాబాద్ ముఖచిత్రాన్ని మార్చే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్**

ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును రద్దు చేస్తామంటూ కొందరు నాయకులు కుట్రలు చేస్తున్నారని, అభివృద్ధిని



అడ్డుకోవాలని చూసే వారికి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గతంలో హైటెక్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి ప్రాజెక్టులను కూడా ఇలాగే వ్యతిరేకించారని, కానీ ఈరోజు అవే హైదరాబాద్ ముఖచిత్రాన్ని మార్చాయని గుర్తుచేశారు. ఈ ప్రాంతంలో భూముల విలువ బంగారం కంటే ఎక్కువగా పెరిగిందని, భవిష్యత్తులో స్థానికులతో చర్చించి మరికొన్ని గ్రామాలను కూడా ఫ్యూచర్ సిటీలో భాగస్వామ్యం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# హైదరాబాద్ హీరోస్ కెప్టెన్‌గా మొరెనో

హైదరాబాద్, ఆట ప్రతినిధి : భాగ్యనగరం వేదికగా జరిగే రగ్బీ ప్రీమియర్ లీగ్ సీజన్2లో ఆతిథ్య హైదరాబాద్ హీరోస్ మరోసారి స్పెయిన్ స్టార్ మాన్యుల్ మొరెనో కెప్టెన్సీలో బరిలోకి దిగనుంది. ఈనెల 16 నుంచి గచ్చిబౌలి స్టేడియం వేదికగా మొదలయ్యే ఆర్పీఎల్ రెండో సీజన్ కోసం హైదరాబాద్ హీరోస్ కెప్టెన్‌గా మొరెనోను ఎంపిక చేసినట్టు ఆ ఫ్రాంచైజీ గురువారం ప్రకటించిందివైస్ కెప్టెన్‌గా భారత్‌కు చెందిన సుమిత్‌కుమార్‌రాయ్ వ్యవహరించనున్నట్లు జట్టు సహ యజమాని శ్రీనాథ్ చిట్టూరి పేర్కొన్నారు. ఈ సీజన్‌కు సంబంధించిన జెర్సీని ఆవిష్కరించారు. ఈనెల 16న తమ తొలి మ్యాచ్‌లో బెంగళూరు బ్రేవ్‌హార్ట్స్‌తో హైదరాబాద్ హీరోస్ తలపడుతుంది.





# మగువల ధనాధన్.. నేటి నుంచి మహిళల టీ20 ప్రపంచకప్

ఐసీసీ ట్రోఫీ నెగ్గాలన్న దశాబ్దాల కలను గతేడాది వన్డే ప్రపంచకప్‌తో నిజం చేసిన భారత మహిళల జట్టు.. ఇప్పుడు మరో మహా లక్ష్యంపై గురిపెట్టింది. కోట్లాది అభిమానుల ఆశలు, ప్రపంచ చాంపియన్‌గా వచ్చిన బాధ్యత, మరోసారి చరిత్ర సృష్టించాలనే తపన మధ్య నేటి నుంచి ఇంగ్లండ్ వేదికగా జరిగే టీ20 ప్రపంచకప్ వేటలోకి దిగుతోంది. ఇప్పటికి తొమ్మిదిసార్లు జరిగిన ఈ మెగా సంగ్రామంలో నాలుగు సార్లు సెమీ ఫైనల్స్‌లో.. ఓసారి ఆఖరాటలో ఓడిన భారత్ పదో ప్రయత్నంలో 'చిన్న కప్పు'ను ఒడిసిపట్టుకోవాలని డిసైడైంది. ఈసారి రికార్డు స్థాయిలో 12 జట్లు బరిలో నిలుస్తున్నా.. క్రికెట్ ప్రపంచం చూపంతా మాత్రం భారత్‌పైనే నిలిచింది. ఈ ఆటలో ఆస్ట్రేలియా ఆధిపత్యానికి ముగింపు పలికి, వరుసగా వన్డే, టీ20 విశ్వవిజేతగా నిలిచి ప్రపంచ క్రికెట్‌లో తన శకాన్ని ప్రకటించాలని పట్టుదలతో ఉన్నది.బర్మింగ్‌హామ్: ఓ వైపు ఫిఫా వరల్డ్ కప్ ఫీవర్ ప్రపంచాన్ని ఊపేస్తుండగా.. మగువల క్రికెట్‌లో ధనాధన్ పోరాటాలకు రంగం సిద్ధమైంది. రికార్డుస్థాయిలో 12 జట్లు బరిలో నిలిచిన మహిళల టీ20 ప్రపంచకప్ శుక్రవారం మొదలవుతోంది. టోర్నీలో కొత్తగా ఐర్లాండ్, నెదర్లాండ్స్ చేరాయి. తొలి రోజు ఆతిథ్య ఇంగ్లండ్, శ్రీలంక మధ్య జరిగే మ్యాచ్‌తో ఈ మెగా ఈవెంట్‌కు తెరలేవనుంది. ఈనెల14న బర్మింగ్‌హామ్‌లో తన చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగే పోరుతో భారత్ ప్రపంచ కప్ వేటను ఆరంభించనుంది. గ్రూప్, నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ టోర్నీలో 12 జట్లు ఆరేసి చొప్పున తొలుత రెండు గ్రూప్స్ పోటీ పడతాయి. టాప్-2లో నిలిచిన జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. జూలై 5న లార్డ్స్ మైదానంలో ఫైనల్ జరగనుంది.

**ఆసీస్‌కు అడ్డుందా..**

ఈ వరల్ కప్‌లో ఆస్ట్రేలియాదే ఆధిపత్యం. తొమ్మిది ఎడిషన్లలో ఏకంగా ఆరు సార్లు విజేతగా నిలిచిందా టీమ్. కానీ, ఈసారి ఆజట్టుకు భారత్‌తో పాటు సొంతగడ్డపై చెలరేగే ఇంగ్లండ్ వరుసగా మూడు ఐసీసీ ఈవెంట్లలో ఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా, డిఫెండింగ్ చాంప్ న్యూజిలాండ్ నుంచి ముప్పు ఉంది. అయినా ఆస్ట్రేలియాను తక్కువ అంచనా వేయలేం. బెత్ మూనీ, తహ్లియా మెక్‌గ్రాత్, ఎలీస్ పెర్రీ, యాష్లే గార్డ్‌నర్, మేగన్ షట్ వంటి మేటి క్రికెటర్లతో ఆ జట్టు బలంగా ఉంది. సోఫీ మోలినుక్స్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేయడంపై జట్టులో కొన్ని భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయినప్పటికీ, వాటన్నింటినీ పక్కనబెట్టి గెలవడమే లక్ష్యంగా ఆసీస్ బరిలోకి దిగుతోంది. ఇక లారా వోల్‌వార్ట్ నేతృత్వంలోని దక్షిణాఫ్రికా జట్టు.. రిటైర్మెంట్ వెనక్కి తీసుకుని వచ్చిన స్టార్ పేసర్ షబ్నిమ్ ఇస్మాయిల్, నీకెర్క్ రాకతో బలం పెంచుకొని టైటిల్ కొట్టాలనే కసితో ఉంది. శ్రీలంక, వెస్టిండీస్, ఐర్లాండ్ లాంటి జట్లపై ఎలాంటి అంచనాల భారం లేదు. ఈ స్వేచ్ఛే వారిని ఫేవరెట్ జట్లకు షాక్ ఇచ్చేలా ప్రేరేపించవచ్చు.



# ఆసియా గేమ్స్‌కు ఇషా, కైనన్

న్యూఢిల్లీ : భారత స్టార్ షూటర్, హైదరాబాద్ అమ్మాయి ఇషా సింగ్ మరోసారి ప్రతిష్టాత్మక ఆసియా గేమ్స్‌లో పోటీ పడనుంది. సెప్టెంబర్‌లో జపాన్ వేదికగా జరిగే ఈ మెగా క్రీడల కోసం మొత్తం 30 మందితో కూడిన భారత షూటింగ్ జట్టును ఎన్‌ఆర్‌ఏఐ గురువారం ప్రకటించింది. తెలంగాణ నుంచి ఇషా సింగ్, వెటరన్ షూటర్ కైనన్ చెనాయ్ చోటు దక్కించుకున్నాడు. ఇటీవల మ్యూనిచ్ వేదికగా జరిగిన ప్రపంచకప్‌లో 25 మీటర్ల పిస్టల్ విభాగంలో స్వర్ణ పతకంతో పాటు ప్రపంచ రికార్డు సృష్టించిన ఇషా ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉంది. ఆసియా గేమ్స్‌లో తను మను భాకర్‌తో కలిసి 10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ రెండో విభాగాల్లోనూ పోటీ పడనుంది. కైనన్ చెనాయ్ ట్రాప్ ఈవెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించనున్నాడు.



Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.